ప్రజాశక్తి

Vol. 1, no. 19

(Oct. 21, 1942)

బెజవాడ, 1942

Prajāśakti

Vol. 1, no. 19

(Oct. 21, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

8 పేజీలు : 0-1-6

PRAJA SAKTI

Regd. No. M. 4486.

సంపాదక వర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు
(సంపాదకుడు)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
ఉమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

ప్రజాశక్తి

అంతర్జాతీయ పార్టీశాఖ
భారత కమ్యూనిస్టుపార్టీ
ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 1 | బుధవారం 21-10-42 బెజవాడ | సంచిక 19

భారత స్వాతంత్ర్యానికి ప్రపంచ ప్రజల ఆతురత

గతవారం పార్లమెంటులో జరిగిన చర్చలో ఇండియా మంత్రి అమెరీ పొగరుబోతుతనంగా ప్రభుత్వం కాంగ్రెసుతో రాయబారాలు సాగించదనీ, ఇతరులకు అట్టి అవకాశమివ్వదనీ స్పష్టపరచాడు. దీన్నే గాళ్లో పచ్చగడ్డిపై పరున్న కుక్క పాలసీ అంటారు. తాను తినదు; ఇతరులను తిననివ్వదు. ఇంకా కాంగ్రెసుతో రాజీపడితే ముస్లింలకు, సంస్థానాధిపతులకు కోపంవస్తుందట; భారతదేశంలోవున్న సైన్యాలకు ద్రోహం చేసినట్టవుతుందట. ఇవి అమెరీ సుభాషితాలు. కాంగ్రెసుతో రాజీ భారతసైన్యానికి ఇష్టంలేదని చెప్పి బ్రిటీషు అమెరికన్ ప్రజలను మోసపుచ్చాలని అమెరీ ప్రయత్నించాడు. కాని ప్రజలు సామ్రాజ్యవాదుల దగాలో పడిపోయే రోజులు గతించి పోయాయి. చరిత్ర వారికి చక్కని గుణపాఠాలు నేర్పింది. అమెరీ కంపెనీ పాలసీ బర్మా, మలయాలను జపాను దుండగీదులకు అప్పగించిన సంగతి వారు మరచిపోలేదు. వారు చర్చిల్, అమెరీలను నమ్ముటలేదు. ప్రజాయుద్ధంలో భారత ప్రజల సంపూర్ణ సహకారం ఎంత అవసరమో వారికి తెలుసు. ప్రజలువేసే అస్త్రసవాళ్లకు జవాబుగా అమెరీ రాజీకి ద్వారం తెరచేవుందనీ, కాంగ్రెసుమినహా తక్కిన పార్టీలతో రాజీకి సిద్ధమేననీ చెప్పాడు. కాంగ్రెసును అణచివేసి, "శాంతి నెలకొల్పాక ఇతర పార్టీలు వైస్రాయి క్రింద పనిచేయడానికి ముందుకు వస్తాయని" ఆశను వెల్లడించాడు.

కాని అమెరీ గొంతెమ్మ కోర్కెలు నెరవేరవు. ఏమంటే కాంగ్రెసును అణచడానికి సాయపడిన పార్టీ రాజకీయంగా తన గొయ్యి తాను త్రవ్వుకొన్నట్లేనని భారతీయులందరూ ఎరుగుదురు. అందుచే ప్రభుత్వం కోరే కాంగ్రెసు వ్యతిరేక సమాఖ్య సాధ్యం కాదు. ప్రభుత్వం రాజకీయపార్టీలన్నిటికి, ప్రజ లందరికి దూరమయింది. అందుచే అమెరీ తలబిరుసు వాగుడు ప్రభుత్వ బలాన్ని తెలుపుటలేదు. వృద్ధాప్యంలో అవయవాలు స్వాధీనం తప్పిపోయినా, చిన్ననాటి వోలె గంతులు వేదామని అనే మూర్ఖుని కోర్కెల వంటివవి. కాని యీ విధంగా భారత ప్రజా ప్రతినిధులకు సామ్రాజ్యవాదులు ప్రభుత్వాధికారాన్ని యివ్వ నిరాకరించడంవల్ల భారత దేశ రక్షణకు, మిత్ర రాజ్యాల జయానికి ఆటంకంగావుంది.

దేశ భక్తుల క్రోధం

సామ్రాజ్యవాదులు గత 200 యేండ్లుగా తాము సాగిస్తున్న దోపిడీ విధానాన్ని యింకా కొనసాగించాలనే అభిప్రాయము అమెరీ, చర్చిలుల ప్రకటనలలో ద్యోతక మవడంవల్ల దేశ భక్తుల క్రోధం మరింత హెచ్చుతోంది. రహస్యంగా అరాచక చర్యలు దేశం అన్ని మూలలా జరుగుతూనే వున్నాయి. క్రొత్తగా పశ్చిమోత్తర సరిహద్దు రాష్ట్రానికికూడ వ్యాపించాయి. 10 వ తేదీన మర్దాన్‌లో కాల్పులు జరిగి 3 చనిపోయారు. మహమ్మద్ యూనస్, అఫ్జల్ వగైరా ముఖ్యమైన కాంగ్రెసు నాయకులు అరెస్టు చేయబడ్డారు. అనగా చిచ్చు సరిహద్దు రాష్ట్రానికి కూడా వ్యాపించుతోంది అన్నమాట.

రాజకోట సంస్థానంలో రైలుపట్టాలు లాగివేయుటచే ట్రెయిన్ పట్టాలు తప్పిందని 16 వ తేదీ పత్రికలు ప్రకటించాయి. బొంబాయిలో బాంబుప్రేలి ముగ్గురు గాయపడ్డారు. గుజరాత్‌లో ఒక రైలుస్టేషను తగులబెట్టబడింది. బెల్గాం సమీపగ్రామంలో పోస్టు సంచులు కొల్లగొట్టబడ్డాయి. 20 వ తేదీ వార్తలలో బొంబాయిలో బైకుల్లాగూడ్సు షెడ్డుకు నిప్పంటించ బడిందనివుంది. పూనాలో బాంబుప్రేలిందనీ, అహమ్మదాబాద్‌లో పోలీసులు తుపాకులు కాల్చారనీ వార్తలు. ఇదేవిధంగా దేశమంతటా ప్రభుత్వ నిర్బంధ విధానం. దేశ భక్తుల అరాజక చర్యలు ఒకదానివెంట మరొకటి సాగుతూనే వున్నాయి.

చర్చిల్ సామ్రాజ్య దురహంకారపూరితమైన ప్రకటనకు అసమ్మతిగా, జాతీయ వాంఛను బలపరుస్తూ, సింధు ప్రధాన మంత్రి అల్లాబక్ష్ తన బిరుదాలను త్యజించాడు. వైస్రాయి సలహాపై సింధు గవర్నరు అల్లాబక్షును మంత్రి పదవినుంచి తొలంగించాడు. మూడు రాష్ట్రాలలో బాధ్యతాయుత ప్రభుత్వాలున్నాయని అమెరీ కోసే కోతలపస ఈ నిరంకుశ చర్యతో బయటపడింది. బహుశా ముస్లింలీగుకు సింధుమంత్రివర్గంలో అవకాశమివ్వడానికి లీగుకు ఆశలు కల్పించి, జాతీయ ఐక్యతకు ఆటంకాలు పెట్టడానికి నిరంకుశాధికారులప్రయత్నం కావచ్చును. 13 వతేదీ పత్రికలో ఒరిస్సామంత్రివర్గ పార్లమెంటరీ కార్యదర్శి, ఒరిస్సామంత్రివర్గం "కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ సంయుక్త జాతీయ మంత్రివర్గాలుండాలని కోరుతూందని" ప్రకటించాడు. ఇది ప్రభుత్వపాలసీ అత్యంత మితవాదులనుకూడా సంతృప్తి పరచడం లేదని రుజువు జేస్తూంది.

ప్రభుత్వం ప్రజలకు పూర్తిగా దూరమవుటచే నిర్బంధం పైననే ఆధారపడుతూంది. దేశంలో ఏమూలచూచినా అరెస్టులు, కాల్పులు, సాముదాయక జరిమానాలు ప్రత్యక్షం. నిర్బంధవిధానం ప్రజలను ప్రభుత్వ వ్యతిరేక చర్యలకుమరింత పురికొల్పుతూంది.

ఇది మార్గంకాదు.

అరాజక చర్యలద్వారా యుద్ధకృషిని కుంటుపరచి సామ్రాజ్యవాదుల నిర్బంధ విధానాన్ని ఎదిరించుదామని, చర్చిల్, అమెరీలకు బుద్ధిచెప్పగలమనీ దేశభక్తులు భ్రమపడుతున్నారు.

మన రాజకీయాలు

కాని అరాచకచర్యలు జరిగే కొలదీ సామ్రాజ్యవాదులు నిర్బంధ విధానాన్ని తీవ్రపరచుతారు. మిత్రరాజ్యాల ప్రజలకు యుద్ధకృషికి భంగం కలిగించే వారిని అణచడానికి మాత్రమే తాము ఆపద్ధతి అవలంబించుతున్నామని చెప్పుకోడానికి అవకాశం దొరుకుతుంది. ప్రభుత్వ నిర్బంధ విధానము ప్రజలలో నిరుత్సాహం, ఓటమి తత్వాన్ని వ్యాపింపజేసి యుద్ధకృషికి విముఖుల్ని చేస్తూంది. దేశభక్తుల అరాచక చర్యలు ఉత్పత్తిని, రాకపోక సౌకర్యాలను కుంటుపరచి యుద్ధకృషిని భగ్నం చేస్తుంది. అందుచే యివిరెండూ దురాక్రమణదారులకు మాత్రమే ఉపయోగ పడుతాయి. రెండూ ప్రపంచ ప్రజావిజయానికి ఆటంకాలే; భారత స్వాతంత్ర్య సంపాదనకు విరుద్ధమైనవే. ఇదే అభిప్రాయాన్ని శాంతి నికేతనంలో చైనా భవనానికి అచార్యుడైన టాన్-యున్-షాన్ పత్రికా ప్రకటనలో వెల్లడించాడు "మీరు ఈ ప్రజాయుద్ధంలో జేరితే ప్రపంచంలో ఎవరూ భారత స్వాతంత్ర్యాన్ని అరికట్టలేరు. మీ మాతృదేశరక్షణ కొరకు, మిత్రరాజ్యాల క్షేమంకొరకు విశ్వమానవ కళ్యాణం కొరకు బ్రిటీషు ప్రభుత్వంతో ప్రస్తుత పోరాటాన్ని మానివేయండి. జపాన్ దుండగీడులను ఎదిరించడానికి ప్రజా ఉద్యమాన్ని నిర్మించండి." అని భారతీయులకు విజ్ఞప్తిచేసాడు. "ప్రపంచ ప్రజలందరిక్షేమం నిమిత్తం. భారత స్వాతంత్ర్యాన్ని ప్రకటించండి. భారత జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించండి." అని బ్రిటీషు ప్రభుత్వాన్ని హెచ్చరించాడు.

బ్రిటీష్ అమెరికన్ ప్రజల ఆందోళన

"భారతదేశ పరిస్థితి విషమించుతోంది. ఇండియాలోవున్న ప్రతి బ్రిటీషు స్త్రీ, పురుషుడు చుట్టూ వాతావరణమంతా తన్ను అసహ్యంతోను విరోధ భావంతోను చూస్తూందని గ్రహించుతున్నారు. ఇది వ్యక్తిగతమైన ద్వేషంకాదు. ప్రార్థించడం, ఇంగ్లీషువాని హృదయం కరుగుతుందని వేచి కాచుకొని వుండటం వృధా అని భారతీయులు విసుకుచెందారు. యుద్ధానంతరం ఇండియాలో బ్రిటీషువారికి ఒక్క మిత్రుడు కూడ మిగలడని న్యూయార్క్ టైమ్సు విలేఖరి వ్రాశాడు. ఈ పరిస్థితి యిలాగే కొనసాగితే- యుద్ధానంతరంకాదు- ఇపుడే, యుద్ధం జరుగుతుండగానే, మనకు మిత్రులెవరూ లేకుండా పోతారు." అని మిస్ మార్గరెట్ పోప్‌వ్రాసింది. వెంటనే భారత స్వాతంత్ర్యాని ప్రకటించాలనీ, జాతీయ వాదులను జైళ్ళనుండి విడుదల చేయాలనీ, ప్రభుత్వాధికారం భారతీయులకు అప్పగించాలనీ కోరింది. సర్ ఆర్థర్ మూర్ ప్రభుత్వం భారతీయులకు అధికారం యివ్వనిరాకరించుటే నేటి ప్రతిష్టంబనకు కారణమన్నాడు. లండన్ టైమ్సు వంటి కన్సర్వేటివ్ పత్రికకూడ ప్రతిష్టంభన యిలాగే కొనసాగనివ్వరాదని వ్రాసింది. ఇండియాలో ఆర్థిక సభ్యుడుగా పనిజేసిన జార్జిషుస్టర్ "పూర్తిగా భారతీయులతోకూడిన ప్రభుత్వాన్ని నిర్మించాలి" అని టైమ్సు పత్రికకు లేఖలో వ్రాశాడు దీనినే వార్డామిల్నే, హెన్రీమెట్కాఫ్‌లు బలపరచారు. న్యూస్ క్రానికల్ (లిబరల్) డైలీ హెరాల్డు (లేబర్) పత్రికలు భారత ప్రజల సహకారం లేకుండా జపాన్ దుండగీడులను ప్రతిఘటించడం సాధ్యంకాదనే సత్యాన్ని ప్రతిధ్వనించాయి.

విఖ్యాత గ్రంథకర్త అయిన బెర్ట్రెండ్ రస్సెల్ అమెరికా నుంచి రేడియోలో మాట్లాడుతూ భారత నాయకులకు నచ్చే రాజీకొరకు మరల ప్రయత్నించాలన్నాడు. అమెరికా, బ్రిటన్ సోవియట్ యూనియన్, చైనాలతో కూడిన మధ్యవర్తి కమిషన్‌ను నియమించాలని ప్రకటించాడు. సుప్రసిద్ధ నవలా రచయిత పెరల్‌బక్ "జాతి, మత విచక్షత లేకుండా అన్ని దేశాలకు యిది స్వతంత్ర్య యుద్ధమేనని మిత్రరాజ్యాలు ప్రకటించాలని చెప్పింది." అమెరికా మతగురువులుకొందరు మధ్యవర్తిత్వం వహించి భారత సమస్యను పరిష్కరించాలని రూజ్‌వెల్టును కోరారు. ప్రభుత్వాభిప్రాయాన్ని సాధారణంగా వెల్లడించుతుందని ప్రతిష్టగడించిన వాషింగ్‌టన్‌పోస్టు పత్రిక చైనా అమెరికాలు మధ్యవర్తిత్వం వహించి భారత ప్రతిష్టంభనను పరిష్కరించాలని వ్రాసింది.

అమెరికన్ ప్రజలు భారత సమస్యను పరిష్కరించాలని కన్పరచుచున్న ఆతురతగాంచి సామ్రాజ్యవాద పత్రిక డైలీ ఎక్స్‌ప్రెస్ విలేఖరి వాపోతున్నాడు. బ్రిటీషు దేశస్తులకంటే అమెరికాలో నేడు గాంధి, నెహ్రూలకు హెచ్చు సన్మానం జరుగుతుందనీ, అమెరికన్ పత్రికలు ఇండియా సమస్యకు హెచ్చు ప్రాముఖ్యత యిస్తున్నాయని కాకిగోలపెడుతున్నాడు. అట్లాంటిక్ మాగజైన్ అనే అమెరికన్ పత్రిక వెంటనే కాంగ్రెసుతో రాజీపడాలని కోరుతూంది. చికాగో విశ్వ విద్యాలయానికి జెందిన డాక్టర్ సుందర్ జోషీ బ్రిటన్-ఇండియాల మధ్య తగవు మిత్రరాజ్యాలకు నష్టదాయకంగా వుందనీ, వెంటనే పరిష్కరించబడాలనీ వ్రాశాడు.

మనకర్తవ్యం

బ్రిటీషు, అమెరికన్ ప్రజాభిప్రాయం నేడు భారతస్వాతంత్ర్యానికి సుముఖంగా వుందని పై ప్రకటనలు తెలుపుతున్నాయి. ఈ మార్పుకు కారణమేమిటి? లక్షలకొలది తమ సైన్యాలు భారతదేశంలోకి ఫాసిస్టులతో పోరాడటానికి పంపబడ్డాయి. ఈ సమయాన భారత ప్రజలసహకారంలేనిచో తమసైన్యాలు విపరీత పరిస్థితుల నెదుర్కోవలసి వస్తాయని వారికి తెలుసు. అందుచే యుద్ధంలో జయించడానికి, తమప్రయోజనాల నిమిత్తంకూడా వారు భారత స్వాతంత్ర్యాన్ని బలపరుస్తున్నారు. ఈ సమయంలో భారతీయులం మనవంతు కర్తవ్యాన్ని నెరవేర్చాలి. జాతీయైక్యతను నిర్మించి, సామ్రాజ్యవాదులకు మిగిలిన ఒకే ఒక సాకునునిర్మూలించాలి. అందుకు భారతకమ్యూనిస్టుపార్టీ నవంబరు ఒకటినుంచీ జాతీయైక్యత ప్రచారవారం జరుపుతుంది. దానికి స్వాతంత్ర్య కాంక్షితులందరూ తోడ్పడాలి. ఈ వారంలోకాంగ్రెసువాదులకు యుద్ధకృషికి విఘ్నాలు కల్గించరాదనీ, ఐక్యత ఒక్కటే స్వాతంత్ర్య మార్గమనీ నచ్చచెప్పాలి. అరాచకచర్యలను ఎంతవరకుఅరికట్టకలుగుతామో, అంతవరకు ప్రభుత్వ నిర్బంధవిధానాన్ని ఎదుర్కొగలుగుతాము. ఎంతవరకు ఐక్యతను నిర్మించ గలుగుతామో, అంతవరకు జాతీయోద్యమాన్ని అణచి వేయాలనే సామ్రాజ్యవాదుల కుట్రను భగ్నం చేయగలుగుతాము; మిత్రరాజ్యాల ప్రజల సాయంతో జాతీయ ప్రభుత్వాన్ని సంపాదించగలుగుతాము; జపాన్ దురాక్రమణదారులను తుదముట్టించి భారతస్వాతంత్ర్యాన్ని సాధించుకొన గలుగుతాము.

ప్రజాశక్తి

21-10-42 బుధవారం

జాతీయనాయకులను విడుదల చేయాలి.

నేడు మన ప్రాచీన భారతభూమి ప్రమాదంలోవుంది. బర్మా, మలయాల ప్రజలకేగతి పట్టిందో మనకుకూడా ఆగతే పట్టేటట్లుంది. జిత్తులమారి ఫాసిస్టు దురాక్రమణదారు సమయంకొరకు కాచుకొనివున్నాడు. వానిక్రౌర్యానికి అంతులేదు.

అట్టి ఫాసిస్టుల్ని నాశనం చెయ్యాలంటే, వీరయోధులకుండవలసిన లక్షణాలు మనకుండాలి.

ఇంతేకాదు. మన దేశీయులలో ఐక్యత అవసరం. ప్రజలందరూ యేకదీక్షతో యుద్ధోన్ముఖులు కావాలి. మన వస్తుసంపదఅంతా ఫాసిస్టుదాడి నెదుర్కొ-వడంలో పూర్తిగా సమీకరించబడాలి. మన మాతృదేశాన్ని జయప్రదంగా రక్షించుకొనేటందుకు జాతీయైక్యత, సంపూర్ణమైన జాతీయైక్యత.- చైనా- రష్యా ప్రజలలో మనం చూచే జాతీయైక్యత, ఉండాలి.

ఇంతేకాదు. నేడు మనకు కావలసింది ప్రజలందరినీ నడిపించగల ప్రజాప్రభుత్వం. 40 కోట్లమంది భారతీయుల్ని ఉత్తేజపరిచి, వారి విశ్వాసాన్ని చూరగొన్న జాతీయ ప్రభుత్వం మన కత్యవసరం.

ఇవి లేకపోతే, మన ప్రజలకు నాశనం తప్పదు. మనదేశం మట్టిపాలై తీరుతుంది. భారతదేశం జపాన్ చేతులలో పడడం ఫాసిస్టు హంతకులబలం యెక్కువ కావడమన్నమాట. మన స్వాతంత్ర్యయోధులకది యెంతటి పరాభవం!

అయితే, నేడు మన మెక్కడున్నాం?

విదేశీ నిరంకుశాధికారులు నేడు మన నెత్తిపై కూర్చున్నారు. సుప్రసిద్ధ దేశభక్తులైన మన జాతీయనాయకులకు వీరు అధికారాన్ని స్వాధీనంచేయ నిరాకరిస్తున్నారు. యుద్ధరంగాలలో పోరుసల్పే సేనలకు మన ప్రజలు సహాయం చేయాలంటే, విదేశీ ప్రభుత్వం వారిని సమీకరించ గలదా? ప్రజల ఐక్యతంటే గజగజలాడుతూ, ప్రజల సమీకరణంటే అసహ్యించుకొనే ప్రభుత్వం ప్రజల్ని యేవిధంగా రక్షించగల్గుతుంది? ఇంతటి ప్రమాదదశలోకూడా ప్రభుత్వం ప్రజలచే పూజించబడు జాతీయ నాయకుల్ని అరెస్టుచేసి, ప్రజల్ని అరాజకచర్యలకు రెచ్చకొడుతూంటే, ఆ ప్రభుత్వమే దేశాన్ని రక్షించగలుగుతుందని యెవరు నమ్మగలరు? మన జాతీయ నాయకులు పంచమాంగదళానికి చెందినవారని మతివున్న యే ప్రభుత్వమైనా నిందించగలదా? బ్రిటిష్ పరిపాలకులు నేడవలంబిస్తూన్నమార్గం సరాసరి జపాన్ ఫాసిస్టుల చేతులలోకి తీసుకెడుతుంది.

మన జాతీయనాయకు లరెస్టుచేయబడ్డానికి ము చ. అఖిలభారత కాంగ్రెసు కమిటీలో వా రీక్రింది విషయాలు స్పష్టమైన భాషలో లోకానికి చాటారు:

— ప్రపంచమంతా నేడు రెండు ముఠాలుగా చీలిపోయింది. మొదటిది ఫాసిస్టు సామ్రాజ్యవాదులు, రెండవది ప్రజలు. మొదటిది బానిసత్వం, రెండవది స్వాతంత్ర్యం.

— మిత్రరాజ్యాలతో కలిసి వుండడమే భారతీయుల ఉచిత ధర్మం భారతదేశ స్వాతంత్ర్యం కొరకు, ప్రపంచస్వాతంత్ర్యంకొరకు, ఈయుద్ధంలో ప్రజలు విజయాన్ని సాధించాలి.

ఇందుకై వారు కేంద్రప్రభుత్వంలో అధికారం కావాలన్నారు. భారతదేశ స్వాతంత్ర్యం గుర్తించబడాలన్నారు. అందుకు దాఖలాగా ఆచరణలో జాతీయప్రభుత్వాన్ని స్థాపించాలన్నారు. అప్పుడే దేశం నిజంగా రక్షించబడుతుంది.

వారిది న్యాయసమ్మతమైన కోరిక. మన దేశీయులందరి శ్రేయస్సును మనస్సులో వుంచుకొని వారావిధంగా ప్రభుత్వాన్ని కోరారు. ప్రజానాయకులు ప్రజలను నడిపించాలంటే, జయప్రదమైన జాతీయరక్షణ వుండాలంటే, ఇతరదేశాలతోబాటు భారతదేశం కూడా స్వాతంత్ర్యసంపాదనకై పోరుసల్పాలంటే, అదొక్కటే సరియైన మార్గం. నేడు ప్రపంచమంతటా జరిగే స్వాతంత్ర్య సంగ్రామంలో యావద్భారతదేశం పాల్గొనేటట్లు చేయడానికిదే రాజబాట.

కాని, ఈ జాతీయ వాంఛను బ్రిటిష్ ప్రభుత్వం నిరాకరించింది. నిరాకరించడమేగాక, జాతీయనాయకులను అరెస్టుచేసి దేశంలో ఒక విషమావస్థను సృష్టించింది. గోరుచుట్టుపై రోకటిపోటు అన్నట్లు, యిప్పుడు దేశంలో జరిగే అల్లరులకు జాతీయ నాయకులే కారణమని నిందిస్తోంది. విషమావస్థను తెచ్చిపెట్టినది తాను. మొదటిపోటు పొడిచినది తాను. నాయకుల నరెస్టుచేయడమంటే అర్థం ప్రజల క్రోధాగ్నిలో ఆజ్యం పోయడమన్నమాట. ఒకసారి పోసి వూరుకోలేదు. నిరంతర ధారగా పోస్తోంది. తా నవలంబించిన మూర్ఖవిధానాన్ని విడిచిపెట్టడంలేదు. మన నాయకుల్ని ఇలాగే జైళ్ళలో నిర్బంధించి యుంచితే, విషమావస్థను యింకా పొడిగించడమన్నమాట. ప్రజల్ని యింకా రెచ్చగొట్టడమన్నమాట. నేడు దేశంలో జరిగే వినాశచర్యలకు, భీభత్సానికీ, బాధ్యత పూర్తిగా సామ్రాజ్యవాదులదే. జాతీయనాయకులేమాత్రము బాధ్యులు కారు.

దేశమంతా వారిని విడుదలచెయ్యాలని కోరుతూంది. అన్ని పార్టీలు, అన్ని ముఠాలు, చిత్తశుద్ధిగల ప్రతి భారతీయుడు, వారిని విడుదలచెయ్యాలంటున్నారు. దేశాన్ని నడిపించడానికి మన జాతీయనాయకుల్ని విడుదల చేయించుకొనకపోతే, ఈ విషమావస్థ తొలగదనీ, దేశరక్షణ కొనసాగదనీ, స్వాతంత్ర్యానికి పోరాడజాలమనీ, నేడు దేశంలో అందరూ గ్రహిస్తున్నారు.

మన నాయకుల విడుదల విషమావస్థనుంచి మనం బయట పడటానికి మొదటిమెట్టు. ఇందుకు పొగరెక్కిన సామ్రాజ్యవాదులు నిరాకరిస్తున్నారు. కొబట్టి భారతీయులందరూ ఐక్యమై, మన నాయకుల్ని విడుదలచెయ్యాలని కోరవలసియుంది. దేశంలో నేడు జరుగుతూన్న విధ్వంసక్రియలు, అరాజకం మాన్పించడానికి జాతీయనాయకుల విడుదల అవసరమని కమ్యూనిస్టుపార్టీ కోరుతోంది. వారు ప్రజలమధ్యకు వచ్చి నిలబడితే, పరిస్థితులు శాంతపడతాయి. పంచమాంగదళం ప్రజలకు దూరమవుతుంది. క్రోధోన్మత్తులైన ప్రజలు చల్లబడతారు. అప్పుడు మన ప్రజలు తమ నాయకులు చెప్పేమాటలు శ్రద్ధతో వింటారు. అంతేగాని, పోలీసుజులుంకు మాత్రం వారెన్నటికీ లొంగరు.

కాంగ్రెసు నాయకుల విడుదల తమ ప్రథమకర్తవ్యంగా యెంచవలసిందని కాంగ్రెసేతర జాతీయ సంస్థలకు భారత కమ్యూనిస్టుపార్టీ విజ్ఞప్తి చేస్తోంది. జాతీయ కాంగ్రెసు లేనిదే జాతీయైక్యత వుండదు. జాతీయైక్యత లేనిదే జాతీయ ప్రభుత్వం సాధ్యంకాదు. జాతీయ ప్రభుత్వం లేనిదే జాతీయరక్షణ అసంభవం. మనం కాంగ్రెసు నాయకుల్ని విడిపించుకొనజాలకపోతే, దేశాన్ని జపాన్ ఫాసిస్టులకు వొప్పజెప్పిన వారమవుతాం.

మిత్రరాజ్యాల ప్రజలకుకూడా భారత కమ్యూనిస్టుపార్టీ ఈ క్రింది విజ్ఞప్తి చేస్తోంది. కాంగ్రెసు నాయకుల్ని విడుదల చేయవలసిందని మీరు మీ ప్రభుత్వంపై ఒత్తిడి చేయండి. వారు మీకుకూడా జాతీయ నాయకులని నమ్మండి. మాదేశీయులందరికీ కాంగ్రెసు ప్రధాన రాజకీయసంస్థ. కాంగ్రెసు నాయకులు మిత్రరాజ్యాల ప్రజలతో సమాన హోదాలో చేయిచేయి కలిపి, భారతీయుల్ని నడిపించగలరు. ఈ అభిప్రాయాన్ని వారు స్పష్టంగా ప్రకటించారు. మా దేశంలో నెహ్రూకంటె యెక్కువ ఫాసిస్టువ్యతిరేకి లేడు. మీ శ్రేయస్సుకై కాంగ్రెసునాయకుల విడుదలను కోరుతూ కార్యరంగంలో ప్రవేశించండి.

సోదర సోదరీమణులారా! ఈ వుద్యమంలో మీరు చేరండి. బ్రహ్మాండమైన సమావేశాలు, ఊరేగింపులు, జరపండి. వీధిమొగలలోను, పేటలలోను, ఎడతెగకుండా సభలు పెట్టండి. ప్రజలచే మహజర్లపై సంతకాలు చేయించండి. దేశభక్తిని ప్రచారంచేస్తూ ప్రజలను ఉత్తేజపరచండి.

సామ్రాజ్యవాదులెంతోమంది లేరు. భారతీయులైక్యకంఠంతో కోరేకోర్కెను వారు నిరాకరించలేరు. దేశాన్ని నేటి విషమావస్థనుంచి రక్షించి, జాతీయైక్యతను సాధించి జాతీయప్రభుత్వాన్ని లాక్కొని, జాతీయరక్షణ నేర్పాటు చెయ్యాలంటే, భారతీయులందరూ ఐక్యమై జాతీయనాయకుల విడుదలకై ఆందోళనచెయ్యాలి. అప్పుడే మనం మన దేశస్వాతంత్ర్యాన్ని సంపాదించడానికి యితర దేశాల స్వాతంత్ర్యప్రియులతో చేయి- చేయి కలిపి పోరాడగల్గుతాం.

భారత కమ్యూనిస్టు పార్టీ

అరెస్టులు - దౌర్జన్యాలు

కర్నూలు జిల్లా రైతుసంఘం సెక్రటరీ కామ్రేడ్ గుర్రం వెంకటరెడ్డి గారిని అరెస్టుచేసి విచారణపెట్టి 1 సం॥ కఠినశిక్ష వేసినారు. వారితోపాటు చిత్తూరు పిచ్చయ్యను విద్యార్థిని అరెస్టుచేసి 3 రోజులు జైలులో ఉంచి వదలివేశారు. వెంకటరెడ్డి, అమరావతి సుదర్శన వర్మ, చిత్తూరి వెంకన్నగార్ల గృహములు సోదాచేయబడ్డవి గాని ఏమియు దొరకలేదు.

ఒంగోలు తాలూకా కమ్యూనిస్టుపార్టీ ఆర్గనైజరు కామ్రేడ్ సి. యల్. నారాయణ, యూత్‌లీగ్ కార్యదర్శి కేశవులుగార్లను అరెస్టుచేసి కొన్ని దినములు జైలులోవుంచి వదలివేసినారు.

పిఠాపురం తాలూకా కూలీ నాయకుడగు కామ్రేడ్ భావనాచారిగారిని అరెస్టుచేసి లాకప్‌లో పెట్టి ఒక స్టేటుమెంటుపై సంతకం పెట్టమన్నారు. సంతకం పెట్ట నిరాకరించినందున కొంతసేపు లాకప్‌లోవుంచి వదలిపెట్టినారు.

రాజోలు తాలూకాలో అరెస్టయిన కామ్రేడ్ దంతులూరి సత్యనారాయణగారిని విడుదల చేయవలసినదిగా గుడిమెళ్ళంక, మల్కిపురం, అంతర్వేదిపాలెం గ్రామాల్లో సభలు జరిగి తీర్మానములు గావింపబడెను.

ది 16-10-42 న ఒక హరిజన స్త్రీ వెంకటగిరి హాస్పటలులో జేర్చుకొనబడెను. ఆమె మర్మావయవమునుండి రక్తస్రావ మగుచూ, స్పృహలేకుండా వారధియొద్దున పడియుండగా కనుగొనబడెను. డాక్టరు ఆమె ప్రమాదావస్థలో యున్నదని తెలియజేసెను. మేజస్ట్రేటు వచ్చి మరణ వాఙ్మూలము తీసికొనగా ఆమె తన్ను టౌన్ పోలీసుస్టేషను సబ్‌యినస్పెక్టరున్ను, హెడ్‌కాన్‌స్టేబిలున్ను ఘోరంగా మానభంగం చేసినట్లుగా స్టేటుమెంటు యిచ్చినట్లు తెలియుచున్నది. వెంటనే గూడూరు సబ్‌కలెక్టరుకు తంతిద్వారా తెలియబర్చగా వారువచ్చి విచారించి వెళ్లినారు. హరిజనస్త్రీ ప్రమాదావస్థలోనున్నట్లు తెలియుచున్నది.

నర్సాపురం తాలూకా తుందుర్రు గ్రామ వ్యవసాయ కూలీలు సబ్‌కలెక్టరు, తహశీల్దారులవద్దకు యువజనసంఘ యాజమాన్యమున రాయబారం వెళ్ళి వర్తకులు ఏవిధంగా అధికధరలకు సరకుల నమ్ముచున్నది విశదపర్చిరి. దానిపై సబ్‌కలెక్టరు హరిజనులకు క్రయిస్తవులకు ప్రత్యేకంగా కిరోసిన్ డిపో పెట్టుటకు యువజనసంఘం వారికి అనుమతి నిచ్చెదమని తెల్పిరి. యువజనసంఘ దరఖాస్తులు గ్రామోద్యోగులు రివిన్యూయిన్‌స్పెక్టరు సర్టిపై చేసిరి. కాని ఎన్నాళ్ళకును ఆర్డరురాకపోవుటచే యువజనసంఘం సెక్రటరీయు, మరొకరు కలిసి నర్సాపురం వెళ్ళి తాలూకా హెడ్‌క్లర్కును విచారించగా ఆయన బూతులు తిట్టి వీరినిద్దరిని బయటకు పంపించెను. తాశీల్దారుగారికి చెప్పినా ప్రయోజనంమాత్రం శూన్యం

జాతీయ ఐక్యత: పోరాటం

కామ్రేడ్ గంగాధర అధికారి

ప్రశ్నావళి

ప్రశ్న:

ఎంతమంది కోరినా, ఒత్తిడిచేసినా జిన్నా ముందుకు వచ్చి కాంగ్రెస్-లీగ్ ఐక్యతకోసం ప్రయత్నించడంలేదు. ప్రభుత్వం ఎవరికీ గాంధీజీతో మాట్లాడటానికి అవకాశం యివ్వడంలేదు. అందుచే కాంగ్రెసు - ముస్లింలీగ్ ఐక్యత తక్షణమే జరగడం అసంభవం. అంతేగాక రాజాజీ, ఆర్థర్‌మూర్‌గార్లు చెప్పినట్లుగా కాంగ్రెసు-లీగ్ ఐక్యత కుదిరినా బ్రిటిష్ ప్రభుత్వం జాతీయప్రభుత్వానికి అధికారాన్ని అప్పగించడానికి ఇష్టపడదు. చర్చిల్, అమెరీల ఉపన్యాసాన్ని యీ సంగతినే రుజువు చేస్తున్నాయి. అందుచే యీ సమయంలో ప్రభుత్వాన్ని లొంగదీయడానికి ఏదోరకమైన పోరాటముండాలి గదా?

జవాబు:

ప్రశ్నించే మిత్రుడు దేశరక్షణ కార్యాలకు విఘ్నం చేయడమూ, స్టేషన్లు తగులబెట్టడమూ నిరుపయోగమని తెలసికొన్నాడు. కాని జాతీయ ఐక్యత ఒక్కటే స్వాతంత్ర్యానికి మార్గమని యింకా గుర్తించలేదు. అందుచే ఐక్యతకోసం చేయాలంటూనే, బ్రిటీషు ప్రభుత్వాన్ని లొంగదీయడానికి సత్యాగ్రహం వంటి పోరాటం అవసరమంటున్నాడు.

ఇతడు స్టేషన్లు తగులబెట్టడం, పట్టాలు పీకడం, దేశరక్షణ కార్యాలకు విఘ్నం చేస్తాయని, అరాచక చర్యలని గుర్తించాడు. కాని పరిస్థితులను సరిగా గ్రాహ్యం చేసికోలేదు. మితవాదుల పంథాను అర్థంచేసికొంటున్నాడు. 1930-32 లాంటి శాసనోల్లంఘనం కావాలంటున్నాడు. అనగా నేడు మన దేశీయులను ఎదుర్కొంటున్న సమస్యను సరిగా అర్థం చేసికోలేదు. సామ్రాజ్యవాదుల, భారతప్రజల బలాబలాలు పూర్వంమాదిరిగా లేవని గుర్తించడంలేదు. అందుచే ఐక్యతాఉద్యమం యొక్క విప్లవ ప్రాముఖ్యతను గ్రహించలేకపోతున్నాడు. శత్రువు మన దేశసరిహద్దుల్లో వేచివున్న సమయాన శాసనోల్లంఘనం కావాలంటున్నాడు.

జపాన్ ప్రమాదం

భారతదేశానికి రెండువైపులనుండి ఫాసిస్టు దుండగీడుల ప్రమాదం సిద్ధంగా వుంది. జర్మనీ జపాన్ ఫాసిస్టులు ప్రపంచాన్ని బానిసత్వంలో ముంచడానికి యుద్ధంచేస్తున్నాయి. ఫాసిస్టులు ప్రపంచాన్ని జయించనైనా జయించాలి; లేదా తత్ప్రయత్నంలో సోవియట్ నాయకత్వాన పోరాడుతున్న ప్రజలచేతుల్లో నాశనమవ్వాలి. మరో మార్గమేమీలేదు. ఫాసిస్టులు భారతదేశంపై దాడివెడలితీరాలి; లేనిచో మిత్రరాజ్యాలు ఫాసిస్టులపైకి దాడి వెడలడానికి భారతదేశం ఉపయోగపడుతుంది. అందుచే మన దేశానికి ఫాసిస్టుల ప్రమాదం వెంటనేవుంది.

జర్మనీ, జపాన్ దుండగీడులు ప్రపంచాన్నంతనూ పాదాక్రాంతం చేయకుండా ఆపగలిగేది బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదులు కాదు. ప్రజలు, బ్రిటిష్, అమెరికన్ చైనా సోవియట్ యూనియన్ ప్రజలతో బ్రహ్మాండమైన ఐక్యతగా యేర్పడి ఫాసిస్టు దురాక్రమణ ఆపుతారు. క్రమక్రమంగా బలపడుతున్న యీ ఐక్యతద్వారానే ఫాసిస్టులు హతమార్చబడి అన్ని దేశాల ప్రజలకు స్వాతంత్ర్యం సిద్ధింపుతుంది. ఫాసిస్టు దుండగీడులనుండి భారతదేశాన్ని సామ్రాజ్య నిరంకుశాధికారుల

సైన్యాలుమాత్రమే రక్షించలేవు. భారత ప్రజలు మిత్రరాజ్యప్రజలతోను, సైన్యాలతోను కలని దేశరక్షణకొరకు పోరాడినపుడే మాతృదేశాన్ని రక్షించుకోగల్గుతాము.

ప్రజాఐక్యత ఒక్కటే మార్గం.

భారత ప్రజలలో ఐకమత్యం వుండరాదనీ, ప్రజా ప్రతిఘటన తమకు అరిష్టదాయకమనీ సామ్రాజ్యవాదులు కోరుతారు. ఏమంటే ప్రజా ఐక్యత నేడు అధికారాన్ని హస్తగతం చేసుకోగల్గుతుంది. యుద్ధాన్ని జయించి స్వతంత్ర భారతదేశాన్ని స్థాపించగల్గుతుంది. అందుకనే చర్చిల్, అమెరీలు పాతపాటనే పాడుతూ అధికారాన్ని భారతీయుల హస్తగతంజేయ నిరాకరించుతున్నారు. కాని యిల్లా ఎంతోకాలం జరుగదు. బ్రిటీషు ప్రజలకు, భారత ప్రజలకు కూడ సర్వనాశనంసంభవించుతుంది. గాన అలా జరుగనివ్వకూడదు. మిత్రరాజ్యాలకు, సోవియట్ ప్రజలకుమధ్య అడకత్తెర వ్యూహంలో సామ్రాజ్యవాదులు చిక్కున్నారు గాన అలా జరుగదు. భారతప్రజలు ఐక్యమయి దేశరక్షణ కార్యాలను భగ్నం చేయడం మానివేసి, బలపరుస్తూ మిత్రరాజ్యాలతో సహకారం చేయడానికి జాతీయ ప్రభుత్వాన్ని డిమాండు చేస్తే గెలిచితీరుతాము. అలాంటి ప్రజాసంఘటన కోర్కెను సామ్రాజ్యవాదులు త్రోసివేయలేరు. ఏమంటే ఆకోర్కెను బ్రిటీషు, అమెరికన్ ప్రజలు, తమ స్వప్రయోజనాల కొరకే బలపరచి తీరుతారు.

నేటి పరిస్థితులివి. సామ్రాజ్య నిరంకుశాధికారులు వెనుకటివలే బలంగాలేరు. ఫాసిస్టు దుండగీడుల నుండి దేశాన్ని రక్షించడం

ద్వారానే నేడు స్వాతంత్ర్యపోరాటం జరగాలి. మనదేశానికి ప్రమాదం వచ్చింది. మిత్రరాజ్యాల ప్రజలతోకలసి, భారత ప్రజలు ఐకమత్యంలో పోరాడితే యీప్రమాదాన్ని ఎదుర్కొని జయించ గల్గుతాము. ప్రజలందరికి ప్రమాదంవాటిల్లింది గాన అట్టి ఐక్యత నేడు సాధ్యమవుతుంది. మన ఐకమత్యంద్వారా సామ్రాజ్యాధికారులను లొంగదీయగల్గుతాము. ఏమంటే బ్రిటీషు ప్రజలకు ఐక్యమయిన భారతప్రజలకు మధ్య అడకత్తెరలో చిక్కున్న సామ్రాజ్యవాదులు లొంగక తప్పదు.

ఐక్యతాఉద్యమం - ప్రజాఉద్యమం

ఈ ప్రధాన విషయాలను అవగాహన చేసికొంటే మనం కోరే ఐక్యత కేవలం నాయకుల మధ్య ఐక్యతమాత్రమే కాదని తెలసికో గల్గుతారు. కాంగ్రెసు నాయకత్వం, ముస్లింలీగ్ నాయకత్వం కలసి ఒకేవాంఛను వెల్లడించినంతమాత్రాన బ్రిటీషుఅధికారులు వెంటనే దిగివస్తారని మేము ఎన్నడూ వాదించలేదు. కాంగ్రెసు, తదితర ముఖ్యపార్టీలు అన్నీ జాతీయ ప్రభుత్వం కావాలనీ, మిత్రరాజ్యాల సహాయంతో దేశరక్షణకు బాధ్యతవహించడానికి సిద్ధంగా వున్నామనీ ప్రకటించాయి. కాని బ్రిటీషు అధికారులు లొంగిరాలేదు. కారణం స్పష్టగానేవుంది. అన్ని పార్టీలు ఒకే వాంఛను వెల్లడించడమంటే బ్రహ్మాండమైన ఐక్యతకు అపుడే పునాది ఏర్పడివుందన్నమాట. కాని అది దేశరక్షణలను బలపరచే ప్రజా ఉద్యమంగా వృద్ధిచెందలేదు. భారత ప్రజల రక్తమాంసాలలో మిళితమయి, దేశ రక్షణకు ఉక్కు కవచంగా పనిజేసే ప్రజా ఉద్యమం

కాలేదు. ప్రజలలో ఒకభాగం, దేశరక్షణలను ఆర్థికవ్యవస్థను భగ్నంచేసే పనులలో పాల్గొంటున్నది. నేడు జరుగుతున్న పోరాటం ప్రజలలో యిదివరకున్న ఐక్యతనుకూడ విచ్ఛిన్నం చేస్తోంది; ఏర్పడవలసిన బ్రహ్మాండమైన ఐక్యతకు అడ్డుగావుంది.

నాయకులమధ్య ఐక్యతమాత్రమే చాలదు

జిన్నా చొరవజేసి ఐక్యతకొరకు ప్రయత్నించుతాడని కాని, జైలులోవున్న కాంగ్రెసు నాయకులనుండి సందేశం వచ్చినంత మాత్రంచేత పరిస్థితులన్నీ గారడీలో వలే మారిపోతాయనిగాని కమ్యూనిస్టుపార్టీ నమ్ముటలేదు. కాంగ్రెసు-ముస్లింలీగు నాయకులుకలసి ఏకైక వాంఛను వెల్లడించినంత మాత్రాన చర్చిల్, అమెరీలు తమంతటతాములొంగిరారు. ఐక్యతా ఉద్యమ విజయానికి కమ్యూనిస్టుపార్టీ ప్రజలపై ఆధారపడుతోంది. దేశభక్తులకు, ప్రజలకు ఐక్యతయొక్క ఆవశ్యకతను నచ్చచెప్ప గలమనీ, వారిని దేశరక్షణకు, ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగించే మార్గాలనుండి మరల్ప గలమని కమ్యూనిస్టులకు విశ్వాసముంది. రానున్న పోరాటంలో, కాంగ్రెసు, లీగు నాయకత్వాలు, వారి మధ్య ఐక్యతా, వహించనున్న ముఖ్య పాత్రను కమ్యూనిస్టుపార్టీ గుర్తించుతోంది. క్రిందనుంచి ప్రజాసామాన్యంలో ఐక్యతా ఉద్యమం ప్రారంభించి, వారిని దేశరక్షణ కార్యాలకు విఘ్నంకల్గించే పనులనుండి విముఖులనుజేసి, ఫాసిస్టు దురాక్రమణను ఎదిరించడానికి, దేశరక్షణకొరకు పోరాడటానికి సుముఖుల్ని చేయగల్గినపుదే అట్టిఐక్యత సాధ్యమవుతుంది. ఐక్యతకొరకు అట్టి ప్రజా ఉద్యమం ప్రజలందరిలో దేశభక్తిని, ఉత్సాహాన్ని కల్గించుతుంది: రానున్న ప్రమాదాన్ని ఎదుర్కోడానికి అవసరమైన దేశ రక్షణను, జాతీయ ఆర్థిక వ్యవస్థను బలపరుస్తుంది. ప్రజా ఉద్యమం వృద్ధిపొందేకొలదీ దేశరక్షణను విఘ్నంచేసే చర్యలు తగ్గిపోతాయి. విభేదాలు, చీలికలుపోయి, ప్రజా ఐక్యత, జాతీయ ప్రతిఘటనాశక్తి వృద్ధి పొందుతుంది.

ఇప్పటివలే అక్కడక్కడ కొలదిమంది నిషేధాజ్ఞలను ఉల్లంఘించటంవల్లగాక "నాయకులను విడుదల చేయండి, కాంగ్రెసు తదితర పార్టీలతో రాజీపడండి;" "దేశ రక్షణ కొరకు జాతీయ ప్రభుత్వం కావాలి" అనే నినాదాల క్రింద ప్రజానీకాన్నంతటినీ సమీకరించుట ద్వారా నిర్బంధ విధానాన్ని యెదిరించుతాము. పౌరసత్వ హక్కులను తిరిగి సంపాదించుతాము. మన నినాదాలు: "దేశ రక్షణకొరకు జాతీయ ప్రజా ప్రభుత్వం! మాతృదేశ రక్షణకొరకు జాతీయైక్యత! ఫాసిస్టు దుండగీడులను ఓడించి భారత స్వాతంత్ర్యాన్ని స్థాపించడానికి మిత్రరాజ్యాల ప్రజలతో భారత ప్రజల ఐక్యత, కావాలి!"

పై విధంగా నడుపబడే ప్రజా ఉద్యమం సామ్రాజ్యవాదులనుండి జాతీయ ప్రభుత్వాన్ని గుంజుకో గల్గుతుంది. ఐక్యతా ఉద్యమాన్ని, ప్రస్తుత ప్రమాద పరిస్థితులలో దేశ రక్షణను బలపరచే ఒకే ఒక స్వతంత్ర సంపాదనా మార్గంగా చూడకపోవుటచేతనే, ప్రశ్నించిన వారికి యీ సందేహాలు వచ్చాయి. ఐక్యతను, సత్యాగ్రహంతో జోడించడం వగైరా యితర మార్గాలన్నీ, ఆచరణలో, నేటి పరిస్థితులలో అరాజకానికి, చీలికలకు మాత్రమే దారి తీస్తాయి.

జాతీయైక్యతావారం

కామ్రేడ్ జోషీ ప్రకటన

కామ్రేడ్స్!

పార్టీ సెంట్రల్ కమిటీయొక్క నిర్ణయాన్ని అమలు పరిచేటందుకు పొలిట్ బ్యూరో (సెంట్రల్ కమిటీచే యెన్నుకొనబడు కార్య నిర్వాహక కమిటీ) నవంబరు 1 మొదలు 8 వరకు భారత దేశమంతటా "జాతీయైక్యత వారం" జరుపవలసిందని ఆదేశిస్తోంది.

కాబట్టి ప్రతి పార్టీ సెల్ వెంటనే సమావేశమై సెంట్రల్ కమిటీ తీర్మానాన్ని కలిసి చదవాలి. ఆ వారంలో యెవరెవరు, ఏ యే పనిని, ఎప్పటికి చేయాలో నిర్ణయాలు తీసుకోండి. ప్రతి సభ్యుని పని, ప్రతి సభ్యుని కోటా వేర్వేరుగా తయారు చేసుకోండి.

పార్టీ సభ్యులలోనే గాక ఉత్సాహవంతులలోను, పార్టీ సహాయపరులలోను, గ్రూప్ సమావేశాలు జరిపి, "కమ్యూనిస్టు పార్టీ విజ్ఞప్తి" ('ప్రజాశక్తి' 14-10-42 వ తేదీ మొదటి పుట) ని చదివి బోధించాలి. జాతీయ ఐక్యతకై మనం ప్రారంభించిన యీ ఉద్యమంలో వారుకూడా చేరి పని చేసేటట్లు ఉత్తేజపరచండి. పార్టీ సభ్యులు మాత్రమేగాక పార్టీని బలపరిచే ప్రతివారు యీ ఉద్యమంలో పని చేసినప్పుడే మనం జయించగల్గుతాం. ఈ విధముగా వారు పార్టీలో సభ్యులుగా కూడా చేరగలుగుతారు.

మన పార్టీ సభ్యు లిదివర కెన్నడూ పూనుకోనంత తీవ్రంగా యీ వారంలో ఆందోళన చేయవలసి యుంది. రష్యా విప్లవ దినోత్సవం (నవంబరు 7) నాడు అద్వితీయమైన వుత్సాహముతో మన పంథాను ప్రజలకు తెలియపరచాలి,

ప్రతిపార్టీ సెల్ ఒక ప్రచారక దళంగా పనిచేయాలి. వీధిమొగలలోను, పేటలలోను, సభలు జరపాలి. దేశభక్తిని పురిగొల్పే పాటలు పాడాలి. ఐక్యతకై ప్రజలఉత్సాహాన్ని రేకెత్తించాలి. ముస్లిం ప్రజలు నివసించే స్థలాలలో ప్రత్యేక శ్రద్ధవహించాలి....

ప్రతి ప్రచారక దళం వీధులలో "పీపుల్స్ వార్" పత్రికలమ్మాలి. నవంబరు 7 వ తేదీకి అమ్మకాలు 100 కి 100 చొప్పున ఎక్కువ కావాలని సెంట్రల్ కమిటీ చేసిన విజ్ఞప్తిని మరచి పోకండి.

ఈ వారంలోనే ప్రతి ప్రచారక దళం "పార్టీయొక్క 2 లక్షల రూపాయలనిధి" కి విరాళాలు వసూలు చెయ్యాలి....

ప్రతి దళం పార్టీ కరపత్రాలను విరివిగా పంచి పెట్టాలి.

ప్రతి దళం ప్రజలచే మహజర్లపై విరివిగా సంతకాలు చేయించాలి....

ఈ కార్యక్రమం పార్టీ యాజమాన్యం క్రిందనే జరపాలి. మన పంథాను ప్రజయెదుట పూర్తిగా పెట్టి వారిని ఒప్పించవలసియుంది. (సభలు నిషేధించ బడిన చోట్ల ఖుండ్లలో సమావేశాలు, మహజర్లపై సంతకాలు, మాత్రమే సాధ్యమవుతుంది)

బెంగాల్‌లో

ఐక్యతకై ఆదర్శప్రాయమైన కృషి

బెంగాల్‌లో నేడు 900 మంది కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, 9,000 మంది పార్టీ సానుభూతి పరులు, వున్నారు. వీరుగాక, సుమారు 20,000 మంది విద్యార్థి సంఘ సభ్యులు, 36,000 మంది రైతుసంఘ సభ్యులు, అనేక వేలమంది కార్మికసంఘ సభ్యులు, వున్నారు.

వీరంతా కలిసి జాతీయైక్యతకై ఆదర్శప్రాయమైన కృషి చేస్తున్నారు. రంగపూర్ జిల్లాలో గైబంధా అనే గ్రామంవుంది. సెప్టెంబరు 1వ తేదీని కమ్యూనిస్టుపార్టీ యాజమాన్యాన 7000 మంది ప్రజలు అక్కడ సమావేశమై, జాతీయైక్యతను కోరుతూ తీర్మానం గావించారు. స్థానిక ముస్లింలీగ్ నాయకుడు కూడా ఆకర్షించబడి, సమావేశాన్ని బలపరచాడు. ఆ జిల్లాలోనే బదర్‌గంజ్ అనే పట్టణం వుంది. అక్కడ స్థానిక ముస్లింలీగ్, కాంగ్రెసు, రైతుసంఘ, విద్యార్థి సంఘాల నాయకులు కలసి, ఒక సంయుక్త ప్రకటన గావించి పట్టణమంతా పంచిపెట్టారు. పార్టీ యొక్క రాష్ట్ర కమిటీ చేస్తున్న కృషికి తోడ్పడుతూ, రాష్ట్రముస్లింలీగ్‌నాయకులుకూడా కాంగ్రెసుతో ఐక్యత విషయమై ఇంకా ముందుకు వస్తున్నారు. జిన్నా ముందంజవేసి రాజీకి ప్రయత్నించాలని యీ నాయకులు కోరుతున్నారు. రాష్ట్ర ముస్లిం విద్యార్థుల ఫెడరేషన్‌కూడా మన జాతీయ అనైక్యత ఏ విధంగా చర్చిల్ అమెరీలను బలపరుస్తోందో తెలుసు కుంటూన్నారు.

బైఠక్ సమావేశాలు

సెప్టెంబరు 13 వ తేదీని గజ్‌బందర్ రైతు సంఘంచే ఆహ్వానించ బడిన సమావేశానికి అనేకమంది కాంగ్రెసు వాదులు, రైతుసంఘ ప్రతినిధులు, ముస్లిం లీగ్ సభ్యులు, ముస్లిం విద్యార్థి సంఘ ప్రతినిధులు, విద్యార్థి సంఘ ప్రతినిధులు, వచ్చారు. బహిరంగ సభకు అనుమతి నిరాకరించ బడింది. కాని, ప్రజలు ఉత్సాహంగా బైఠక్ సమావేశం (ఇంట్లో సమావేశం) జరిపారు. జాతీయ పతాకం, లీగ్‌జండా, రైతు-విద్యార్థిజండాలు, ప్రతిష్టించ బడ్డాయి. ప్రభుత్వనిర్బంధ విధానాన్ని ఖండిస్తూ, కాంగ్రెసునాయకుల విడుదలను కోరుతూ, తీర్మానాలను గావించ బడ్డాయి.

ధరల కంట్రోలు.

మైమెన్‌సింగ్ జిల్లాలో సరీశబరీ అనే గ్రామంవుంది. అక్కడి బియ్యం వగైరా సరకులు దొరక్క రైతులు అనేక యిబ్బందులు పడుతున్నారు. అక్కడి రైతుసంఘంలో పనిచేస్తున్న కమ్యూనిస్టులు అనేకమంది ముస్లిం యువకులతోకలిసి ఒక స్థానిక రక్షణకమిటీని యేర్పాటుచేశారు. వీరు సబ్ డివిజనల్ ఆఫీసరు దగ్గరకువెళ్ళి సంప్రతించిన మీదట అతడు కంట్రోలు ధరలకు సరుకులు అమ్మే అధికారాన్ని యీ కమిటీకిచ్చాడు. బారిసాల్, ఫరీద్‌పూరు, సాహెపూరు లలో బహిరంగ సభలు జరిగిగాయి. వాటిలో ధరలకంట్రోలును అమలు జరుపవలసిందని ప్రభుత్వాన్నికోరుతూ తీర్మానాలు గావించబడ్డాయి. బారిసాల్‌లో అనేక వేలమంది సంతకాలతో మహజర్లు పంపబడ్డాయి.

కయ్యూరు కామ్రేడ్సుకై ఆందోళన.

చిట్టగాంగు, రాజషాల్, గైబంధా, బెహ్రాంపూర్, ఫరీద్‌పూర్, బారిసాల్, మొదలైన ప్రదేశాలలో లక్షలాదిరైతులు సమావేశమై, కయ్యూరు రైతునాయకుల ఉరిశిక్షను రద్దు చేయవలసిందని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు, టెలిగ్రామ్‌లు, జాబులు, మహజర్లు పంపారు.

డక్కా జిల్లాలో

హసైల్, సోనారంగ్, గ్రామాలలో సెప్టెంబరు 14, 15 తేదీలలో స్థానిక ముస్లిం లీగ్, రైతు సంఘాల యాజమాన్యాన బహిరంగ సభలు జరిగాయి. అక్కడవుండే "పోరాట వాదులు" సభలనుపాడుచేయ ప్రయత్నించారు. కాని, సభలకు హాజరైన వేలకొద్ది రైతులు వారిని నివారించారు. ప్రతి గ్రామంలోను ఐక్యత వుండవలసిన యీరోజులలో "పోరాట వాదులు" విచ్ఛిన్నాన్ని కోరుతున్నారని ఉపన్యాసాలీయబడ్డాయి. కాంగ్రెస్-లీగ్ ఐక్యతను కోరుతూ తీర్మానం గావించబడింది.

కార్మికులలో ఐక్యత.

సెప్టెంబరు 20 వ తారీఖున కలకత్తాలో జరిగిన కార్మికసమావేశం చరిత్రాత్మకమైనది. కలకత్తానగరానికి రక్షణ విషయంలో ప్రధానమైన వేర్వేరు కార్మిక సంస్థల ప్రతినిధులు మొత్తం 305 మంది అక్కడ సమావేశమయ్యారు. కామ్రేడ్ ముజఫర్ అహమ్మద్ అధ్యక్షత వహించాడు. ప్రభుత్వ విధానాన్ని ఖండిస్తూ, జాతీయనాయకుల విడుదలను కోరుతూ, సమావేశంలో తీర్మానించబడింది. జాతీయ ప్రభుత్వ స్థాపనకై జాతీయైక్యతను కోరుచు మరొక తీర్మానం గావించబడింది.

బెంగాల్ స్త్రీల కృషి.

ఫాసిజం స్త్రీల జీవితానికి మహా మారి. ఈ యదార్థాన్ని బెంగాల్ స్త్రీలు గ్రహిస్తున్నారు. రాష్ట్రంలో ప్రచారం నిమిత్తం ఒక తాత్కాలిక కమిటీ స్థాపించబడింది. బారిసాల్‌లో 7 రక్షణదళాలు స్థాపింపబడ్డాయి. అక్కడ స్త్రీలకు ప్రథమ చికిత్స, కర్రసాము నేర్పబడుతోంది. షేర్‌పూరులో స్త్రీలకు అనేక "బైఠక్" సమావేశాలు యేర్పాటు చేయబడి వాటిలో స్త్రీల కర్తవ్యాలను గురించి ఉపన్యాసాలీయబడ్డాయి. హుగ్లీ, బాలి, చిన్సూరా, మహేష్తల, అనే ప్రదేశాలలో రక్షణకమిటీలను స్థాపించి, యింటింటికీవెళ్ళి స్త్రీలలో ప్రచారం చేస్తున్నారు. బర్మాకు సరిహద్దున వున్న చిట్టగాంగ్‌లో యిటీవల బ్రహ్మాండమైన ఊరేగింపు, బహిరంగసభ, జరిగాయి. జాతీయ రక్షణ, జాతీయైక్యత వీటినిగురించి ఉపన్యాసాలివ్వబడ్డాయి.

ఈవిధంగా బెంగాలు రాష్ట్రమంతా ఫాసిస్టు ప్రతికూలోద్యమం విరివిగా వ్యాపించుతోంది. బర్మా సరిహద్దుననున్న బెంగాలు ప్రజలు జపాన్ దాడి నెదుర్కోడానికి ఉత్సాహంగా సన్నాహ మవుతున్నారు.

వీరస్మృతి

"ఇంగ్లీషు రాకపోవడం ఒక ఆటంకంగా వుందిగాని ఆ కామ్రేడ్ ఆంధ్ర రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీకి గొప్ప నాయకుడు అయ్యే లక్షణాలు వున్నాయి" అని అఖిల భారత పార్టీ కార్యదర్శి కామ్రేడ్ జోషీ రిమార్కు చేసాడు.

ఆ కామ్రేడ్ భారత కమ్యూనిస్టు పార్టీ రహస్యకాలంలో సాహిత్యం ఉత్పత్తిచేసిన స్థానం (డెన్) లో పని చేసాడు. దానిలో పని చేసే కామ్రేడ్స్ అందరికి ఆదర్శప్రాయుడయ్యాడు. పార్టీ సాహిత్య ఉత్పత్తి ప్లానును జయప్రదంగా నెరవేర్చి ఆర్గనైజరుగా తన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. కట్టుబాటుతో పని జేసేవాడు; తన విద్యుక్త కర్తవ్యాన్ని నెరవేర్చేవాడు. అంతేగాక యితరులు తమ పనిని పూర్తి చేయడానికి సాయపడేవాడు. అతని కార్యదీక్ష, బోల్షివిక్ చైతన్యం, చూచే కామ్రేడు జోషీ పై రిమార్కు చేసాడు.

ఆ కామ్రేడు మరెవరో గాదు; బెజవాడ ప్రెస్ వర్కర్ మన చాపల వెంకటేశ్వరరావే. యుద్ధం వచ్చి బహిరంగంగా పార్టీ పని చేయడము అసంభవమయ్యాక 1940 ప్రారంభంలో రహస్య ముద్రాలయం స్థాపించబడినది. దానిని ఆర్గనైజు చేయడానికి, దానిలో పనిచేయడానికి బెజవాడ ప్రెస్ వర్కర్సు యూనియన్ ప్రప్రథమ కార్యదర్శి అయిన కామ్రేడ్ చాపల వెంకటేశ్వరరావును ఆంధ్ర కమిటీ పంపింది. పార్టీ పిలుపు వినడమే తడవుగా ఆ కామ్రేడ్ అత్యుత్సాహంతో బయలుదేరి వెళ్ళాడు. పార్టీ నాయకుడు మెచ్చుకొనేటట్లుగా తన కర్తవ్యాన్ని నెరవేర్చాడు.

కామ్రేడ్ చాపల వెంకటేశ్వరరావు 1935 నుంచి బెజవాడ ప్రెస్ వర్కర్సును ఆర్గనైజు చేయడానికి కృషి చేశాడు. తాను నిర్మించిన బెజవాడ ప్రెస్ కార్మికుల సంఘానికి మొదటి రెండు సం॥లు కార్యదర్శిగా పనిజేసాడు. ఇతర కామ్రేడ్స్‌తో కలిసి పనిజేసి 1938 నాటికి ఆంధ్ర రాష్ట్ర ప్రెస్ వర్కర్సు యూనియన్ నిర్మించగల్గాడు. దాని ప్రథమ మహాసభ అతనిని కోశాధికారిగా యెన్నుకొంది. అప్పటి నుంచి 1940 లో రహస్యంగా వెళ్ళేవరకు ఆ పదవిలో వున్నాడు

1937లో కార్మికులను ఆర్గనైజుచేయడంలో అతని కృషికి కానుకగా కమ్యూనిస్టు పార్టీలోకి తీసికోబడ్డాడు. అదే సంవత్సరంలో కామ్రేడ్ వెంకటేశ్వరావు బెజవాడ కాంగ్రెసు సోషలిష్టుపార్టీకి సహాయ కార్యదర్శిగా కూడ ఎన్నుకోబడ్డాడు. పగలంతా ప్రెస్సులో భుక్తి కొరకు అలసిపోయేటట్లు పనిచేసేవాడు. రాత్రిళ్ళు పార్టీపనికిగాని, సమ్మె జేస్తున్న కార్మికులకు ఉత్సాహాన్ని పురికొల్పుతూగాని హెచ్చుకాలాన్ని వినియోగించేవాడు.

ఈ కామ్రేడ్ జీవితాన్ని స్మరించేటప్పుడు 1938 నవంబరులో వచ్చిన ఆంధ్రగ్రంథాలయ ప్రెస్ సమ్మె తప్పక జ్ఞాపకం వస్తుంది. ఆ రోజుల్లో సమ్మెను జయప్రదం గావించడానికి అతడు పడిన శ్రమ గొప్పది. తాను కష్టించి పనిచేయడంద్వారా కార్మికులలో ఉత్సాహాన్ని రేకెత్తించి సమ్మెను జయప్రదంగా నడిపాడు. తోళ్ళ షాప్ కూలీల సంఘాన్ని కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుతో కలసి పనిజేసి నిర్మించాడు.

కార్మికవర్గానికి అతడు చేసిన సేవను, అతని విప్లవచైతన్యాన్నిగమనించియే రహస్య సాహిత్య ఉత్పత్తివంటి బాధ్యతను, కామ్రేడ్ వెంకటేశ్వరరావుపై పార్టీ వుంచింది. సానపెట్టిన కొలదీ మెరిసే వజ్రంవలే, బాధ్యత హెచ్చిన కొలదీ పరీక్షలకునిలబడి ఆదర్శ కమ్యూనిస్టుకు కావలసిన పటిమను ప్రదర్శించాడు.

1941 నవంబరు 4 వ తేదీన చనిపోవునప్పటికి ఈ కామ్రేడుకు 32 ఏండ్లు వుంటాయి. భార్యను ఇద్దరు కొడుకులను, తాను సేవచేస్తున్న అనేకవేలమంది కార్మికులను, దుఃఖ సముద్రంలోముంచి కీర్తిశేషుడయ్యాడు రహస్య జీవితంలో మరణశయ్యపై సైతం అతనిలో ద్యోతకమైన ఆత్మశక్తిని మన మందరం ఆదర్శంగా ఎంచవలసివుంటుంది.

1941 జూన్‌లో తన భార్య, పిల్లలను చూచిపోవడానికి ఆంధ్ర దేశం వచ్చాడు. రహస్య జీవితంలోవుండే కష్టాలవల్ల, బాధ్యతతో హెచ్చు పనిని చేయడంవల్లనూ కొంత బరువు తగ్గాడు. పార్టీ ముఖ్యమైన డాక్టర్లచే పరీక్ష చేయించినది. ఆ మాయదారి జబ్బు యెచట దాగి వుందో! చూచిన డాక్టర్లంతా ఏమీ జబ్బులేదు: బాగా విశ్రాంతి తీసుకుంటే చాలని చెప్పారు.

ఒక నెల రోజులు విశ్రాంతి తీసుకున్నాడు. కాని ఆ బోల్షివిక్, చేతులు ముడుచుకు కూర్చోడాన్ని అసహ్యించుకునేవాడు. ఇంకో నెల విశ్రాంతి తీసికోమని పార్టీ నాయకులు అంటే, "అబ్బే! ప్రపంచమంతా మూసలో కరుగుతున్న యీ సమయంలో నేను నావంతు కర్తవ్యం నెరవేర్చవద్దా?" అనేవాడు. విశ్రాంతి కాలంలో పది పౌన్లు హెచ్చాడు. "జాగ్రత్తగా వుండి ఆరోగ్యం కాపాడుకుంటాను లెండి" అని నాయకులను బలవంతంపెట్టి తన డ్యూటీలో చేరాడు.

రెండు నెలలయినా తిరిగ రాలేదు. కామ్రేడుకు జ్వరం వచ్చింది. టైఫాయిడ్ అనుకొని ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి "ఇది టైఫాయిడ్ కాదు! గాలపింగ్ టి. బి. (క్షయ)" అని చెప్పి ఆ ఆస్పత్రిలోనుంచి తీసుకుపొమ్మన్నారు. డాక్టర్ల దృష్టిలో ఆ జబ్బు నయమయ్యేది గాకపోయినా, ఆదర్శప్రాయుడైన ఆ కార్మిక యోధునిపై వుండే అప్యాయతవల్ల నాయకులు అతనిని ఆఖరి దశలో వుంచే టి. బి ఆస్పత్రిలో చేర్ప నిరాకరించారు. తన డెన్‌లోవుంచి డాక్టర్ అధికారి స్వయంగా శుశ్రూష చేసాడు. ఇద్దరు డాక్టర్లు ప్రతినిత్యం పరీక్ష చేసి, సాధ్యమైన అన్ని మందులను వాడారు. మందులకే 600 రూపాయల దాకా అయినాయి. కాని మన కామ్రేడ్ ఆరోగ్యాన్ని జయించ లేకపోయాడు.

మరణశయ్యపైవున్నా ఆకామ్రేడ్ బోల్షివిక్ చైతన్యాన్ని గోల్పోలేదు. డెన్‌లోగాని, ఆఖరు రోజుల్లో ఆస్పత్రి డాక్టర్ల వద్దగాని సంధిలో యెంతో బాధ పడుతున్నపుడు కూడా, తాను రహస్యంగా పార్టీ పనిజేస్తున్నాననే సంగతిని మరచి పోలేదు; యేమరుపాటున ఐనా పార్టీకి నష్టంవచ్చేమాట బైటికి జారవిడువ లేదు. బాగా స్మృతివున్న దినాలలో డెన్‌లో వున్న మిత్రునితో "బ్రదర్ వచ్చాడా?" (కామ్రేడ్ సుందరయ్యను బ్రదర్‌అని పిలచేవాడు) అనిమాత్రం ప్రశ్నించాడు. దగ్గరవున్న కామ్రేడ్ "ఇచటలేడు. దక్షిణదేశం వెళ్లాడు. చూడాలనివుందా! పిలిపించమంటావా?" అని సంధిలో అడిగితే "అక్కరలేదు! వచ్చారేమో అని అడిగాను" అని సర్దుకున్నాడు. మరణ యాతన అనుభవించు తున్నపుడు వెనుకటి సంగతులు ఏమీచెప్పకుండా వుండటం, "గొప్ప ఆత్మశక్తిని, చైతన్యాన్ని తెలియజేస్తుంది. ఆ స్థితిలో వాగకుండా కంట్రోల్ చేసికోనగల్గిన కేసును నేను ఎన్నడూ చూడలేదు." అని అతనితోవున్న సానుభూతిపరుడైన డాక్టరు మెచ్చుకున్నాడు.

మన కామ్రేడ్ వెంకటేశ్వరరావు, మనలను విడచిపోయి ఒక యేడాది అవుతోంది. అతడు ఏ ఆదర్శంకోసం జీవించాడో, ఏగమ్యస్థానాన్ని చేరడానికి తన కర్తవ్యం నెరవేర్చుతు తన జీవితాన్ని అర్పించాడో ఆ ఆదర్శ గమ్యస్థానాలు మన ఎదుట యింకా అలాగే నిలచి వున్నాయి. ఆ బోల్షివిక్ యోధుని బాష్పాంజలితో స్మరణజేస్తూ మన కర్తవ్యాన్ని నెరవేర్చుతామని ఆంధ్రకమ్యూనిస్టులు మందరం పిడికిలిబిగించి ప్రతినబూనుదాం.

—కామ్రేడ్ చలసాని వాసుదేవరావు

ఆహారపదార్థాల క్లిష్టసమస్య

అఖిలభారత కేంద్రకిసాన్ సమావేశ తీర్మానం

నాగపూర్‌లోసమావేశమైన కేంద్రకిసాన్ కమిటీ రైతులకే భరింప నలవిగాకున్నటువంటి పన్నులను, మక్తాలను, అప్పులను వెంటనే తగ్గించవలెనని గవర్నమెంటును కోరింది. ఫాసిస్టు దురాక్రమణకు గురికానున్న మాతృభూమిని రక్షించుటకు రైతులను సమీకరించటానికి యిది అవుసరము. బీటాలో సమావేశమైన అఖిలభారతకిసాన్ సభలో కూడా రైతులకు వెంటనే యీ సౌకర్యాలను కల్గించి రైతులను ఉత్సాహపరిచితే ఆహారపదార్థాల అధికోత్పత్తికి రైతులు బాగా తోడ్పడుతారని నొక్కి వక్కాణించింది. అయినప్పటికి గవర్నమెంటు యీ విషయములో యింతవరకు, ఇండియా జనాభాలో నూటికి 80 మంది యైన రైతులకు యేమి చేయకపోయినందులకు ప్రస్తుతము సమావేశమైన కేంద్ర కిసాన్ కౌన్సిల్ అసంతృప్తి తెలియజేస్తూంది.

దేశమంతటా కూడా ఆహార పదార్థాలు, యింకా జీవితానికి అవసరమయ్యే యితర వస్తువులు సప్లయి కాకపోవుటవలన రైతులకు చాలా కష్టంగావుంది. ఎగుమతికి సరియైన వీలు లేకపోవుటవలనను, సామగ్రి ఒకచోటు నుండి యింకొకచోటికి పోవుటకు సరియైన యేర్పాటు లేకపోవుటవలనను పల్లెలలో నున్న బీదప్రజలు అత్యవసరమైన సరకులకు కూడా చాలా బాధపడుచున్నారు. సప్లయిలు సరిగా చాలకుండా ఉండే పరిస్థితులలో, గూడా, సప్లయిలు సరిగా ఆగకుండా వస్తాయనే నమ్మకం లేకపోవడంవలన, టోకువర్తకులు ధాన్యాలను తదితర ముఖ్యసరకుల అమ్మకానికి రానివ్వకుండా నిలువచేయటంవలన, అనవసరమైన కరువు చాలా ప్రదేశాలలో సంభవిస్తూ ఉంది.

ప్రభుత్వపు అసమర్థత; గందరగోళపు విధానం

గవర్నమెంటు ఏర్పరచిన 'ధరలకంట్రోలు కమిటీ' దాని ఆదర్శాలను నెరవేర్చుటలో పూర్తిగా నిరుపయోగమయింది. దాదాపు అన్నిచోట్లకూడా అనుకున్నదానికి వ్యతిరేకముగా ఫలితాలు వచ్చాయి. ఏ సరుకైతే కంట్రోలు పెట్టబడిందో ఆ సరుకు మార్కెట్టులోంచి మాయమైపోయింది. యే వస్తువుకు ధర యెలా నిర్ణయించాలో తెలియకుండా తోచినట్లు పదార్థాల ధరలు నిర్ణయించారు. ఉదాహరణకు: అవసూనే యొక్క ధరను నిర్ణయించి, అవాలయొక్క ధరను నిర్ణయించకుండా వూరుకున్నారు. కంట్రోలు నిర్ణయించిన తర్వాత ఆ వస్తువు సరిగ సప్లయి అవుతుందనే గ్యారంటీ లేదు. నిరుపేదలకు అవసరమయ్యే వస్తువులలో చాలామట్టుకు కంట్రోలు అధికారుల దృష్టిలోనికి అసలు రావడమే లేదు. వస్తువుల ధరను నిర్ణయించి సప్లయిలు బాగా జరిగేటట్లు ఒక ప్లానువేసి గవర్నమెంటు చేయలేకపోయింది. దానివలన ఫలితాలు అనుకున్నదానికి వ్యతిరేకంగా వచ్చి పల్లెలలోనుండే ప్రజలను చాలా కష్టాలపాలు జేసింది. ఈ ఏర్పాటు లంచగొండులైన అధికారుల అక్రమ సంపాదనకు మరొక ఆధారమైంది. టూకీగా చెప్పాలంటే సామాన్య ప్రజా సామాన్యానికి యుద్ధమువలన ఏర్పడిన కష్టాలను తొలగించి, కనీసపు జీవితావసరాలను సప్లయి చేయించుటకు గవర్నమెంటు తగు చర్య తీసుకోలేదు. ప్రభుత్వం చూపించే యీ నిర్లక్ష్యమైన నిర్లక్ష్యాన్ని, అసమర్థతను యీ కౌన్సిలువారు తీవ్రంగా ఖండిస్తున్నారు.

ప్రత్యేకంగా యీ కొద్దినెలల నుండి గ్రామసీమలలో పెరుగుచున్నటువంటి యీ కష్టాలను వెంటనే తొలగించుటకు గవర్నమెంటు యీ క్రింది చర్యలను వెంటనే తీసుకోవాలని యీ కమిటీ కోరుచున్నది

౧ ఆహారపదార్థసంఘాలను కోరండి

(1) ఆహారపదార్థాలు, యింకా జీవితావసరాలకు అవసరమయ్యే సరకుల సప్లయి సరిగా జరుగుటకు, రాష్ట్రాలలో నిపుణులతోను ప్రజాసంస్థలతోను ప్రజాసంస్థల ప్రతినిధులతోను, కూడిన ఒక ప్రత్యేక కమిటీని, ప్రతి రాష్ట్రములోను గవర్నమెంటు ఏర్పాటుచేయాలి.

(2) ధాన్యాలు, మొదలైన జీవితావసర వస్తువులకు ధరలను నిర్ణయించడానికి, ఆ పదార్థాలను వివిధ ప్రాంతాలకు వర్తకులకు పంచడానికి, ప్రయివేటు వర్తకుల వాణిజ్యానికి అనుబంధంగా, ఆ పదార్థాలను దిగుమతి చేయడానికి-కొనడానికి-అమ్మడానికి- రాష్ట్ర, జిల్లా, తాలూకా ఆహార పదార్థ సంఘాలను ఏర్పరచాలి. ఈ సంఘాల్లో యెక్కువమంది పలుకుబడి గల ప్రజా ప్రతినిధులే ఉండాలి.

(3) పెద్దవ్యాపారస్థులునిలవచేసేధాన్యము, అక్కడ ఉన్నటువంటి "కౌన్సిల్" అజమాయిషీలలో ఉండటానికి వీలుగా నున్నటువంటి, రిజిష్టరు చేసినటువంటి, కొట్లలోనే నిలువ పోయాలి.

(4) ప్రతిరోజూ జీవితానికి అవసరమయ్యే సరకులను గ్రామసీమలలోని ప్రజాసామాన్యం కొనుక్కొనుటకు అందుబాటులో వుండేటట్లు ధరలను నిర్ణయించాలి.

సరసమైన నిర్ణీతధరలు

(5) ఒక గ్రామములోగాని, కొన్ని గ్రామాలలో కలిపిగాని వెయ్యిమందికితక్కువగాకుండా వుండేచోట చౌకధరల ధాన్యపు అంగడిని గవర్నమెంటు పెట్టించాలి. ఆ కొట్టు అక్కడవుండే "కౌన్సిల్" అజమాయిషీలో వుండాలి.

(6) నిర్ణయించబడ్డ ధరలకే స్వంతవ్యాపారస్తులు అమ్మేటట్లు చేయడానికి, లంచాలకు అసమర్థతకు అవకాశం లేకుండా చేయడానికి, ఆ యా ప్రదేశాలలో ఉండే టోకు, చిల్లర వర్తకుల నిలువలను, వ్యాపార సరకులను తనిఖీ చేయడానికి, పుడ్ కౌన్సిళ్ళకు ప్రభుత్వం అధికారం ఇవ్వాలి.

(7) రైతులు పండించే సరకులకు సరియైన ఖరీదు వచ్చేటట్లు గవర్నమెంటు ధరలను నిర్ణయించాలి. ఇట్లా నిర్ణయింప బడ్డధర అక్కడ వ్యాపారస్తులు యింతకన్నా ఎక్కువ అమ్మకూడదని గవర్నమెంటు నిర్ణయించిన దానికి నూటికి 20కన్నాతక్కువ వుండకూడదు. ఈ ధరను నిలబెట్టడానికి అవసరమైనంత సరకును గవర్నమెంటురైతుల పంటను కొనటానికి తయారుగా వుండాలి.

౨. కాన్ఫరెన్సులు, ప్రదర్శనాలు జరపండి

(1) ప్రస్తుతం వున్న ప్రభుత్వం బాధ్యతారహితమైనట్టిది గాబట్టి, యీ పై కోర్కెలను తీర్చటానికి పూనుకోదని, పూనుకోటానికి శక్తి కూడా లేదని యీ కౌన్సిలు తలుస్తూవుంది. కాని, ప్రస్తుత పరిస్థితులు ముఖ్యంగా గ్రామాలలో చాలా దుర్భరంగా ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించటానికి కిసానులు చొరవజేసి గ్రామంలో ఉండే ప్రజా సామాన్యాన్నంతా సమీకరించాలని ఈ కౌన్సిల్ కోరుతూవుంది. ఇందుకుగాను గ్రామంలోని అన్ని వర్గాల సహకారంతో కిసానులు కాన్ఫరెన్సులు, ప్రదర్శనాలు జరపాలి; మహజర్లు పంపాలి.

(2) గ్రామంలో ఉండే ముఖ్యపార్టీలు మతస్తులు, చిల్లరవర్తకులు కిసానులు మొదలగు వారియొక్క ప్రతినిధులతో కూడిన ప్రజల కమిటీలను స్థాపించి. వారికోర్కెలను ప్రజాసామాన్యం అర్థం చేసికొనేటట్లు ప్రచారం చేయాలి.

(3) అధికలాభ వ్యతిరేక విజిలెన్సు కమిటీలను నిర్మించాలి.

౩ పంటలను నిలువచేయండి

ఈ కోర్కెలు నెరవేరేలోపుగా, కిసానులు తమ పంటలను నిలువచేయమని ఈ కౌన్సిలు కోరుతూఉంది. అంతేగాక, ఈ క్రిందిపనులను కూడా చేయాలని హెచ్చరిస్తూవుంది.

(1) రాబోయే 12 నెలల కాలానికి సరిపోయే ఆహారయోగ్యమైన ధాన్యాలను, పంటలను, కిసానులు నిలవచేయాలి.

(2) బకాయిపడ్డ అన్నిపన్నులు, మక్తాలు అప్పులవసూళ్ళకు వాయిదా వేయమని, తాము యెంతవరకు తీసికొని రాగలరో అంత ఒత్తిడి ప్రభుత్వంపై తీసికొని రావాలి.

(3) తమకు సంవత్సరానికి అవసరమైన ఆహార పదార్థాలు, గడ్డి నిలువలపై కొత్త జప్తులు లేకుండేటట్లు, మహజర్లుద్వారా, ప్రజా ఒత్తిడి ద్వారా చేసికోవాలి.

(4) తమ అప్పులను, నగదు పూర్వకంగానే తప్ప ఇతర విధాలుగా తీర్చటానికి నగదు పూర్వకమైన అప్పుల చెల్లుకు ధాన్యాలను యివ్వటానికి తిరస్కరించాలి.

(5) అప్పులను వస్తురూపేణా తీర్చేటప్పుడు చెల్లుబడిఅప్పుడు యే పరిస్థితులలోనైనా 1 రేట్లకు మించకూడదు. అప్పు యిచ్చేవారి పుచ్చుకునేవారి పరస్పర ఒడంబడికల ద్వారా యిది కొనసాగించాలి.

(6) ధాన్యాన్ని ఇతర ఏవిధమైన పంటలను గాని, ఇవ్వమనిగాని, అమ్మమనీగాని, వర్తకులు, భూకామందులు, షాహుకార్లు, ప్రభుత్వం తరఫున కొనేవారు చేసే, బలవంతానికి కిసానులు లొంగకూడదు.

(7) గ్రామాల్లో దొరకని జీవితావసరమైన వస్తువులకోసం, కిసానులు గ్రామంలో ఉండే చిల్లరవర్తకులతో సహా ప్రజాసామాన్యాన్నంతా సమీకరించి, స్థానిక సంస్థలద్వారా ఒత్తిడి తీసుకొనిరావాలి.

(8) కంట్రోలు అధికారులు, వర్తకులు పుడ్ (ఆహారపదార్థాలు) కౌన్సిళ్ళు, మామూలుగా చేసే సప్లయిలు చాలనప్పుడు, అవసరమైనంత సప్లయిలు, ఎల్లప్పుడూ వచ్చేటట్లు చేయగలందులకు, కిసానులు కొనేవారి పరపతిసంఘాలు (Buyers' Cooperative Societies) నిర్మించాలి.

(9) తమ పంటలకు కనీసపు ధరలు రాగలందులకు, కిసానులు సేల్ కో ఆపరేటివ్ (అమ్మకపు పరపతి) సంఘాలు స్థాపించాలి.

కాంక్షితలక్ష్యం

లెఫ్ట్ - రైట్, లెఫ్ట్ - రైట్
లెఫ్ట్ ఈజ్ రైట్
అంటూ బారుల సాగిస్తాం॥
అదిగో
ఇదిగో
వచ్చేస్తాం
బాంబుల వర్షం
కురిపిస్తాం
స్వతంత్ర మిదిగో
ఇచ్చేస్తాం
అంటూ చెప్పే
తుంటరి మాటల
టోకియో రేడియో
పుకారులన్నీ
పెడ చెవి
పెడుతూ
లెఫ్ట్ - రైట్, లెఫ్ట్ - రైట్
లెఫ్ట్ ఈజ్ రైట్
అంటూ బారుల సాగిస్తాం.

• • •

ఏమీ తోచక
ఇటు అటు తిరుగుతు
బోనులొ సింహాలు
బొబ్బలు పెడుతూ
చెల్లాచెదరై
ఒళ్లు తెలియనీ
ఉద్రేకంల్లో
ఏవో చేస్తే
తుపాకు లెట్టి
లాఠీల్‌బట్టీ
బెదిరిస్తూ
మరింత ప్రజలని
దురంతాల పా
ల్జేసే ప్రభుత్వ
దోసం చూపుతు
లెఫ్ట్ - రైట్, లెఫ్ట్ - రైట్
లెఫ్ట్ ఈజ్ రైట్
అంటూ బారులు సాగిస్తాం.

• • •

ఫాసిస్ట్వైతిరే
కాశయులౌ మన
దేశ నాయకుల
చెర విడిపిస్తూ
కలకాలంగా
కటకటాలలో
దిటినూత్యలుగా
కట్టిన కామ్రేడ్స్
సత్వర స్వేచ్ఛను
సాధిస్తూ
చెట్టాపట్టాల్
పట్టుక కట్టుగ
హిందూ ముస్లిమ్
పొందును గోరుతు
కక్షల కలుపుతు
దీక్షతోటి జా
తీయ ప్రభుత్వం
తీసికొనొస్తూ
లెఫ్ట్ - రైట్, లెఫ్ట్ - రైట్
లెఫ్ట్ ఈజ్ రైట్
అంటూ బారులు సాగిస్తాం.

• • •

ఉరోదుగాల్లా
ఉరుకలు పెడుతూ
గెరిల్లాలుల్లా
పరాక్రమిస్తూ
తరంగాలుగా
దాడులు తీస్తూ
లక్ష లక్షల
అక్షోహిణులతొ
రాక్షస ఫాసిస్ట్
కక్షల కుక్షులు
కర కర కర
నరికేస్తూ
పర పర పర
పట పట పట
కపాల భక్షణ
కాంక్షిస్తాం
లక్ష్యిస్తాం
ప్రపంచ శాంతిని
సాధిస్తాం
లెఫ్ట్ - రైట్, లెఫ్ట్ - రైట్
లెఫ్ట్ ఈజ్ రైట్
అంటూ బారులు సాగిస్తాం.

—కామ్రేడ్ "వసుమతి"

కార్మికుల కష్టాల నివృత్తికి మునిసిపల్ వర్కర్ల త్రోవ

ఈ నెల 9 వ తారీకున, బెజవాడలో మ్యునిసిపాలిటీలోని ఒకడివిజనులో పనివాళ్ళు సమ్మెజేశారు. దీనికి కారణం అధికారుల అక్రమం. ముగ్గురు మ్యునిసిపల్ వర్కర్లు తమ సంఘంలో చాలా చురుకుగా పనిచేస్తున్నారని అధికారవర్గం వాళ్ళని కావాలని బదిలీచేసింది. ఇది చాలా అక్రమం, బదిలీని రద్దు చేయండి అని పనివాళ్ళంతా మొరపెట్టితే అధికారులు పెడచెవినిపెట్టారు. ఈ నిర్లక్ష్యానికి జవాబుగా ఆ డివిజను పనివాళ్ళు పని కట్టిపెట్టారు. దానితో అధికారులకు వేడిపుట్టి, బదిలీని ఉపసంహరించుకొన్నారు.

ఇట్టి విజయమే మరొకటి బెజవాడ మ్యునిసిపల్ వర్కర్లు సంపాదించారు. క్రిందటినెలలో, ఒక ఎద్దుల గుమాస్తా రబ్బిష్‌బండి వర్కరు నొకనిని సరైన కారణం లేందే బెదరించి, కొట్టాడు. వెంటనే బండ్లపనివారంతా ఆగిపోయి, కమీషనరు వద్దకు వెళ్ళి ఆ గుమాస్తాను మార్చమని కోరారు. మార్చకపోతే పనిలోకి పోమన్నారు. ఆ మరునాడే ఆ ఎద్దుల గుమాస్తాను మార్చిపారవేసారు.

రాష్ట్రసంఘానికి కొత్తబలం

రాష్ట్రమునిసిపల్ వర్కర్లసంఘానికి కొత్తశాఖలు బయలుదేరాయి. రామచంద్రపురం పంచాయితీ యూనియను యొక్క పనివాళ్లు ఒకసంఘాన్ని స్థాపించారు. దాన్ని రాష్ట్రసంఘంతో కలిపారు.

నరసాపురం పంచాయతీబోర్డు పనివాళ్ళు కూడా ఒక సంఘాన్ని క్రిందటినెలలో స్థాపించుకున్నారు. రాష్ట్రసంఘంతో ఒక శాఖగా చేర్చారు. ఇందులో దాదాపు 60 మంది సభ్యులున్నారు.

తమకష్టాల నివృత్తికి

ఒక్కొక్క పనివానికి 70-100 దొడ్లను శుభ్రం చేసేపని అధికారులు నిర్ణయించారు. గంటలకొలది దుర్భర దుర్గంధంలో మునిగి పనిచేస్తూంటే ఆరోగ్యం చెడిపోతుంది. ఇట్టి హానికరమైన పనికి పరిమితి ఉండాలి. అదే బందరు, కాకినాడ, రాజమండ్రి, బెజవాడ మునిసిపల్ పనివాండ్రు కోరేది. "మాకు పని తగ్గించాలి; 40 దొడ్లకన్నా ఎక్కువ నిర్ణయించ కూడదు." అని పనివాళ్ళు తమ అధికారులను కోరుతున్నారు. తీవ్రఆందోళన చేస్తున్నారు. అధికారులు పనివాళ్ళ కష్టాన్ని తీర్చక కబుర్లుచెప్పుతూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు. కాని పనివాళ్లు "మీరు ఈ పని ఈనెలలోనే జరిపితీరాలి." అని అధికారులకి కచ్చితంగా తెలియపర్చారు. తమ సంఘంలో, తమలో ఎంతో నమ్మకం సంపాదించిన ఈ వర్కర్లు, ఇదివరకు ఏవిధంగా తమ కష్టాలను నెరవేర్చుకున్నారో, ఆవిధంగానే ఈ కష్టంగూడా జయప్రదంగా గట్టెక్కించుకొనగలరు.

గుడివాడ మునిసిపల్ పనివారు, దాదాపు సంవత్సరం నుంచి రూపాయికి పావలా కరువుభత్యానికై ఆందోళన జేస్తున్నారు. క్రిందటి నెలలో మ్యునిసిపల్ కౌన్సిలు అధికారులు, నెలకు రెండు రూపాయలు చొప్పున కరువుభత్యం యివ్వటానికి ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు. కార్మికులు రాష్ట్రప్రభుత్వ ప్రకటన ప్రకారం నెలకు కార్మికునికి 4 రూపాయలు చొప్పున కరువుభత్యం యివ్వాలని కోరుతూ తీర్మానించారు. ప్రస్తుతం యిచ్చిన రు 2 లు పుచ్చుకొని తక్కిన దానికి ఆందోళన చేయాలని తీర్మానించుకొన్నారు.

ఏలూరు మునిసిపల్ పనివారల సంఘపు జనరల్‌బాడీ 22.9.42 న సమావేశమై మునిసిపల్ అధికారులు కరువుభత్యాన్ని అమలు జరపనందున తగుచర్య తీసికోమని ప్రభుత్వానికి విజ్ఞప్తి పంపుకొన్నది.

విశ్రాంతి లేకుండా ఏలాగు పనిచేయాలి ?

ప్రస్తుతం కాలమానం అనుసరించి, బెజవాడ రైల్వే శానిటరీశాఖ కార్మికులు ఉదయం గం 7 నుంచి గం 11 ల వరకు పనిచేసి, తిరిగి గం 2 లకే పనిలోకి రావాలి. ఈ శాఖలో చాలామంది స్త్రీలు, వాళ్ళ ఇండ్లకిపోయి, వంట చేసికొని, సంసారం దిద్దుకొని, భోజనం చేసేటప్పటికే మధ్యాహ్నం గం 2 లు ఐపోతుంది. ఇక వాళ్ళకు విశ్రాంతి అనేమాట ఉండదు. విశ్రాంతి కావాలంటే ఆలస్యంగా పనికి వెళ్ళడమే! అంటే, ఆపూట ఆబ్సెంటు అన్నమాట. ఈ ఇబ్బందులన్ని లేకుండా ఉండాలంటే మధ్యాహ్నం టైము 3 గంటలకు మార్చాలి. ఇలా మార్చమని కోరుతూ మొన్న 15 వ తేదీన ఈ శాఖ కార్మికులు సమావేశమై ఒక తీర్మానాన్ని అధికారులకు అందజేశారు.

ఈశాఖ పనివాండ్రకు ఇంకొక ఇబ్బంది ఉన్నది. వీరిలో చాలామందికి రైల్వేక్వార్టర్లు లేవు. లేకపోయినా ఇంటిఅద్దె అలవెన్సూ లేదు. ఇది అన్యాయం. తక్కిన రైల్వేకార్మికులకు ఈ అన్యాయం జరగటం లేదు. కాబట్టి వీరికి కూడా క్వార్టర్లయినా ఇవ్వాలి. లేకపోతే, అలవెన్సైనా ఇవ్వాలి. ఇట్టి కష్టాన్ని త్వరలో తీర్చమని కోరుతూ పై సభలో మరొక తీర్మానం గావించబడింది.



"జాతీయప్రభుత్వం కావాలి"
"జాతీయనాయకుల విడుదలచేయాలి"

గూడూరు డివిజన్ మైకావర్కర్ల యూనియన్ కార్యనిర్వాహకవర్గం 4 వ తారీఖున సమావేశమై జాతీయ, ఫాసిస్టువ్యతిరేక నాయకులను వెంటనే విడుదలచేయాలి, జాతీయప్రభుత్వం యేర్పరచాలి అని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు చేసింది.

క్రిందటినెల 25 వ తారీఖున, విశాఖపట్టణంలో, హార్బరు వర్కర్లు తమ సంఘ యాజమాన్యంక్రింద ఊరేగింపు, సభ జరిపారు. జాతీయ నినాదాలతో కూడిన తీర్మానాలు గావించారు. జాతీయప్రభుత్వం లేందే నిజమైన దేశరక్షణ లేదని గవర్నమెంటుకు హెచ్చరిక జేశారు.

గుంటూరుజిల్లా వ్యవసాయ కూలీసంఘ కార్యవర్గం 12 వ తేదీన సమావేశమై ప్రభుత్వ నిర్బంధవిధానాన్ని ఖండిస్తూ, బర్మా, మలయాలగతే ఇండియాకు కూడా పట్టకుండా ఉండాలంటే, వెంటనే జాతీయప్రభుత్వ స్థాపనకు ప్రభుత్వం పూనుకోవాలని తీర్మానించారు.

ఎముకలను తొలిచేస్తున్న కరువు

ప్రభుత్వపు అసమర్థతవల్లనైతేనేమి, వ్యాపారస్థుల అంతులేని స్వలాభాపేక్షవల్లనైతేనేమి, పనివారల పేదరికంవల్లనైతేనేమి, పాటకపుజనుల జీవనం రోజు రోజుకూ దుర్భరమైపోతూ ఉంది. నిత్యజీవనానికి అవసరమైన వస్తువులు చాలినంత దొరకవు: దొరికినా కొనటానికి అందని అపరిమితమైన అధిక ధరలు. రెక్కలాడితేనే కాని డొక్కలాడని కార్మికులకే అన్నివిధాలా బాధ. ఈ అనవసరపు కరువు నుండి వీరిని రక్షించాలంటే, ముఖ్యంగా, ప్రభుత్వం ధరలను కంట్రోలు చేయాలి, ఆ కంట్రోలు సరిగా అమలు జరిపించాలి; దానికి అవసరమైన చర్య తీసికోవాలి, అవసరమైన పరిస్థితులు కల్పించాలి.. ఇదే కార్మిక సామాన్యపు వాంఛ. ఇందుకే వారు తీవ్ర ఆందోళన చేస్తున్నారు.

దివి తాలూకాలోని ఘంటసాల పాలెం చుట్టు ప్రక్కల ఉన్న మాలవారు తహసిల్దారుకు ఒక మహజరును 300 సంతకాలతో పంపారు. "మలమల మాడుతున్నాం. కనుక వెంటనే, అప్పులు ఇప్పించి, చవుక ధరల ఆహారపదార్థాల డిపోలను పెట్టించండి" అని ఆ మహజరు సారాంశం.

కొండెవరం (పిఠాపురం) రైతు కూలీసంఘం, 190 సంతకాలతో ఒక మహజరును డిప్యూటీ కలెక్టరుకు పంపుకుంది. బియ్యపుధరల తగ్గించమని, అధికధరలను అరికట్టమని కోరింది.

గుంటూరుజిల్లా వ్యవసాయకూలీ సంఘపు కార్యనిర్వాహకవర్గం ధరలకంట్రోలుకు ప్రభుత్వం వెంటనే పూనుకోవాలని తీర్మానించింది. అంతటితో ఆగక, తాముగూడా చేతనైనంత వరకు కృషిచేయాలని, వెంటనే, తాలూకాకు ఒకటి చొప్పునైనా, కోపరేటివు స్టోర్సు ఏర్పాటు చేయాలని తీర్మానించింది.

రాపూరి తహశీల్దారు సలహా

సైదాపురం, కలిచేడు, తురుమెర్ల ప్రాంతాలలోని మైకా గని పనివారు అధికధరల వలన అపరిమితబాధ పడుతున్నారు. ఈ కష్టాల నివృత్తికి ఏదైనా చేయండని, గూడూరు డివిజన్ మైకాపనివారల సంఘపు కార్యదర్శి తహశీల్దారునకు ఒక విజ్ఞప్తి పంపించాడు. ఆ తహసిల్దారు మైకా యజమానులకు ఈ క్రింది సలహా ఇచ్చాడు. "అడ్వయిజరీ కమిటీవారు నిర్ణయించిన ధరలకుగాని, ఇంకా తక్కువధరలకు గాని ఆహారపదార్థాలను అమ్ముటకు డిపోలను ఒక వారములోపల స్థాపించుదురని ప్రార్థిస్తున్నాను." ఈ క్లిష్ట పరిస్థితులు ఇంకా విషమరూపం దాల్చకుండా ఉండాలంటే యజమానులు వెంటనే యీ సలహాను అమలు జరపాలి. దానికి తహసిల్దారు కూడా తగు సహాయం చేయాలి.

అధికారుల కొక రాయబారం

నెల్లూరు మునిసిపల్ పనివార్లకు కరువుభత్యం విషయంలో కనీసపు కోర్కెలే నిరాకరించబడ్డాయి. ఆహారపదార్థాలు రెండు, మూడు రెట్లు ధరలుపెరిగిపోతే, మునిసిపల్ అధికారులు 0-8-0 హెచ్చుగా ఇచ్చి తృప్తిపడండోయి అని అన్నారు. ఇదివరకు సమ్మె చేసినప్పుడు సమ్మెరోజులకు జీతం తెగకోసివేశారు. యీ కష్టాలను నెరవేర్చడానికి అధికారులను కోరడానికి ఒక రాయబారం తీసికొని వెళ్లాలని పనివారల సంఘపు వర్కింగుకమిటీ తీర్మానించింది. ఆ తీర్మానంలోని ఒక భాగం పనివారలలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు ఎంత చైతన్యం కల్గించాయో స్పష్టపరుస్తోంది. అది "జపాను దాడి అరికట్టుటకు ప్రజలనందరిని సమకట్టవలసిన అవశ్యకత గుర్తెరుగక, కార్మికుల 'కనీసపు కోర్కెలను' అధికారులు చాలా ఉదాసీనభావంతో చూస్తున్నారు. అదిచాలా అనర్థదాయకం, అని అధికారులకు హెచ్చరిక.

భారత రైతాంగానికి అ. భా. రైతుసంఘ హెచ్చరిక

సెప్టెంబరు ఆఖరువారంలో బొంబాయిలో అఖిల భారత కిసాన్ సభ కార్యవర్గం (సి. కె. సి.) సమావేశమై ఈక్రింది తీర్మానాలను చేసింది.

1. రాజకీయ తీర్మానం భాగాలు: మహాత్మా గాంధి తదితర కాంగ్రెసు నాయకులను అరెస్టు చేసినందులకును, కాంగ్రెసును నిషేధించినందుకును; పోలీసు, మిలిటరీ దారుణ నిర్బంధ విధాన్ని సాగించి నందులకున్ను ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించు చున్నది......... ఈ నిర్బంధ విధానం ప్రజల ద్వేషాగ్నిని తద్వారా రైలుపట్టాలు పీకుట, మున్నగు విధ్వంసక చర్యలను రెచ్చగొట్టుతూ వుంది. ఈ ప్రజల గుడ్డి దురంతాలను, విధ్వంసక చర్యలను, దేశభద్రతను, రక్షణకార్యాలను భగ్నపర్చేవిగాను, పంచమాంగ దళం వారు తమకుపయోగించు కొనుట కవకాశం కల్పించేవిగాను సి. కె. సి భావిస్తూ వీటిని నిరసించు చున్నది........ప్రభుత్వాన్ని బలహీన పర్చేది గాక, దేశరక్షణను, ప్రజలను నాశనపర్చే ఈ అరాజక చర్యలు, విధ్వంస చర్యలలో పాల్గొన వద్దని రైతులను ప్రజాసామాన్యాన్ని సి. కె. సి. హెచ్చరించు చున్నది. ఈక్లిష్ట పరిస్థితి నుండి బయట పడాలంటే కాంగ్రెసు లీగు ఐక్యతకు దారితీసే హిందూ ముస్లిం ప్రజల ఐక్యతపై విశాలమైన జాతీయైక్యతను నిర్మించు వేయని సి. కె. సి. నమ్ముచున్నది. మన అనైక్యతయే ప్రభుత్వం యొక్క కడపటి ఆ యుధం. కాబట్టి దేనిముందు ప్రభుత్వ నిరోధం పతనం కాగలదో అట్టి జాతీయైక్యతను మనం నిర్మించాలి. కాబట్టి ప్రజలు కాంగ్రెసు నాయకుల విడుదల కొరకు ఆందోళన చేయాలి.

ప్రభుత్వాధి కారాన్ని హస్తగతం చేసికోగల్గిన దేశరక్షణకు సమర్థమైన జాతీయైక్యతనుహిందూ ముస్లిం యితరజాతుల ఐక్యతకు ఉద్యమాన్ని ప్రతీ గ్రామంలోను, పల్లెలోను సాగించాలి.

గ్రామాల్లో శాంతిని కాపాడండి. విధ్వంసకులను ప్రజలనుండి దూరం చేయండి. పౌరసత్వ హక్కుల పునరుద్ధారణ కొరకు, సాముదాయిక జరిమానాల రద్దు కొరకు ఆందోళన చేయాలి.

ప్రజల ఐక్యతా బలం వల్లనే ఆహార పదార్థాల కొరత, అధిక లాభాలు మొ॥ స్థానిక సమస్యలను పరిష్కరించండి.

ఆర్థిక, రాజకీయ విముక్తి కొరకై లివరుగా పనిజేయుటకై రైతుసంఘాలను బలపర్చండి.

సభ్యత్వం.

రైతుసంఘాలలో డిసెంబరు 31 లోగా సభ్యులను జేర్పించాలి. ఫిబ్రవరి 20 లోగా డెలిగేట్ల ఎన్నికలు. మార్చి 15లోగా అ.భా.కి. కౌన్సిల్ సభ్యుల, అధ్యక్షుని ఎన్నిక.

ఏప్రిల్ మొదటి వారంలో పంజాబులో అ. భా. రై. మహాసభ జరుగుతుంది.

నెల్లూరుజిల్లా పార్లపల్లెలో

ది 16—10—42 న గ్రామరైతు సంఘ యాజమాన్యాన సభ జరిగింది. ఉత్సవంలో 100 మంది సభలో 400 మంది పాల్గొన్నారు. కూలీ రైతుసంఘాల అవస్యకతనుగూర్చి, దేశ పరిస్థితులనుగూర్చి, కాంగ్రెసునాయకుల విడుదలనుగూర్చి, జాతీయప్రభుత్వస్థాపనయొక్క అవసరాన్నిగూర్చి కామ్రేడ్ రాజగోపాలరెడ్డి వెంకయ్య, దేవయ్యగార్లు మాట్లాడారు. రైతు సంఘంలో జేరినందుకు బీదరైతుల్ని కొంతమంది హింసించుచున్నారని వార్తలు.

కృష్ణాజిల్లా రైతుసంఘం

ది 8—10—42 న కృ. జి. రై. సం. జనరల్‌బాడీ సమావేశమయినది. కంట్రోలు చేసినప్పటికి కిరోసిన్, అగ్గిపెట్టెలు వగైరా సరకులు విపరీత ధరలకు అమ్ముటనుగూర్చి చర్య దీసికోవాలనియూ, ఇతర జీవితావసరముల యొక్క ధరలనుకూడా కంట్రోలు చేయాలనియు, కో-ఆపరేటివు సేల్సు డిపోలను లేదా ప్రభుత్వ డిపోలను యేర్పాటు చేయాలనియు, ప్రజాసంఘ ప్రతినిధులతో కూడిన కంట్రోలు బోర్డులను ఏర్పాటుచేయాలనియు, జిల్లాకు సరిపోగా మిగిలిన సరకులనే ఎగుమతి చేయాలనియు, ప్రభుత్వాన్ని కోరుచూ తీర్మానించ బడెను.

2 వ తీర్మానం: యుద్ధపరిస్థితుల వలన యేర్పడిన ఆహారపదార్థముల కొరతను భర్తీ చేయుటకు ప్రభుత్వం ఆహార అధికోత్పత్తి కొరకు బంజరుభూములు సాగుకిచ్చెదమని భూస్వాములు సాగుచేయని భూములను సాగుకు నిచ్చెదమని, చెర్వుల మరమ్మతు కై స్పెషల్ రివిన్యూ ఇనస్పెక్టరును నియమించితిమని ప్రకటించింది. ఈజిల్లాలో ముఖ్యంగా నూజివీడు, తిరువూరు, నందిగామతా॥లలో బెజవాడ మెట్టప్రాంతములలోను చెర్వులక్రిందనే మాగాని సాగుచేయ బడుచున్నది. ఈతాలూకాలలో చాలాగ్రామాలు జమీందార్లు మొఖాసాదార్లపై యున్నవి వారు శిస్తులు మాత్రమే వసూలు చేసుకొను చుండిరిగాని చెర్వులను ఏమాత్రం మరమ్మతు చేయుటలేదు. చెర్వులన్నియు చాలా సంవత్సరములనుండి మరమ్మతులేక తూములుపాడైపోయి చాలా చెడుస్థితిలో వున్నవి. వ్యవసాయమునకేమాత్రం ఉపయోగపడుటలేదు. ప్రస్తుతం ఈ తాలూకాలలోని చెర్వులలో నిల్వయున్న కొద్ది నీటినివ్యవసాయమునకువుపయోగపర్చక నీరు బయటకు తీసి చెర్వు లోతట్టు భాగమును వర్జీనియా పొగాకు, శనగలకు కౌలు కిచ్చుచున్నారు. కాబట్టి ప్రభుత్వమువారు ఆ పద్ధతిని వెంటనే అరికట్టి చెర్వులన్నీ స్వాధీనము చేసికొని మరమ్మతులు చేయవలెననీ, మరమ్మతులకైన ఖర్చును జమీందార్లు మొఖాసాదారుల నుండి వసూలు చేయవలెనని యీ సభవారు కోరుచున్నారు.

4. ఈ సం॥ జిల్లాలో డిసెంబరు ఆఖరుకు 25000 ప్రాథమిక సభ్యులను జేర్పించాలి.

తాలూకాల విభజన :-

దివి 4000, గుడివాడ 4000, గన్నవరం 4000, నందిగామ 4000, బెజవాడ 3000, మునగాల 2000, తిరువూరు 1000, నూజవీడు, 1000, బందరు 1000, కైకలూరు 1000.

తిరువూరు తాలూకాలో చెర్వుల సమస్య

కృ. జి. రై. సం. కార్యదర్శి తిరువూరు తాలూకాలో సర్యటనం చేసి చెర్వుల మరమ్మతు విషయంలో డి. టి. సరిగా అమలు జరుగుటలేదనియు, స్పెషలు రెవిన్యూ యిన్‌స్పెక్టరును నియమించుట నామమాత్రమే గాని చెర్వుల మరమ్మతు పూర్తిగా అగునట్లు కనిపించుట లేదనియు, యీ విచారణ కేవలం అధికమైన సాగుకు వీలుంటుందేమో చూచుటకే ననియు తెలియజేయుచున్నారు.

మునగాల రైతుసంఘసమావేశం

ది 11-10-42 న మునగాల జమీన్ రైతు సంఘ సమావేశం జరిగింది. నల్లపాటి వెంకటరామ నర్సయ్యగారిని అధ్యక్ష స్థానంనుండి తొలగించి ఘట్టు గోపాల కృష్ణయ్యగారిని యెన్నుకొన్నారు. రాజీ విషయంలో ప్రభుత్వం దగ్గరకు డెప్యుటేషను వెళ్లవలెననియు, అక్టోబరు కిస్తీకి డిసెంబరు వరకు వాయిదా యివ్వవలెననియు కోరుతూ తీర్మానములు గావింప బడెను.

రేపల్లె తాలూకా వ్యవసాయ కూలీసంఘం

ది 13-10-42 న రేపల్లె తా॥ వ్యవసాయ కూలీ సంఘ సభ జరిగింది. జపాన్ దండయాత్రను ఎదిర్చ సిద్ధమగు కాంగ్రెసు నాయకుల నరెస్టు చేసిన ప్రభుత్వ చర్యను ఖండిస్తూ వారిని వెంటనే విడుదల చేయాలనియు, జాతీయ ప్రభుత్వాన్ని యేర్పాటు చేయాలనియు కోరుతు తీర్మానించబడెను.

రైతులోకం

జపాను ఫాసిష్టులతో పోరాడ నిశ్చయాన్ని తెల్పిన కయ్యూరు కమ్యూనిస్టు శిక్షితులను విడుదల చేయాలి అని ప్రభుత్వాన్ని కోరడమైనది.

బంజరు భూములను బీద కూలీల కిచ్చుటలో చిన్న ఉద్యోగులు కల్పించు ఆటంకాలను తొలగించాలని ప్రభుత్వం కోరబడెను.

సంగం జాగర్లమూడిలో సమిష్టి వ్యవసాయ క్షేత్రం

సంగం జాగర్లమూడి వ్యవసాయ కూలీ సంఘం కార్యదర్శి కామ్రేడ్ కొత్త రామ క్రిష్ణగారు యిలా వ్రాయుచున్నారు :—

ఈ సంవత్సరం ప్రభుత్వ ప్రకటన ప్రకారము బంజరు భూములను సాగు చేసికొనుటకుగాను మా వ్య. కూ. సంఘ సభ్యులలో 66 గురు సభ్యులు, బంజరు భూములను సాగు చేసిరి. దరఖాస్తు దాఖలా భూమి షుమారు య॥ 15—0 పదిహేను యకరములు. చెరువు పోరంబోకు. అందులో ఈ సంవత్సరం సాగు చేసిన భూమి షుమారు య॥ 5—0 అయిదు యకరములు మాత్రమే. మిగిలినది చెర్వునకు చుట్టూ కట్టలుగల్గి పెద్ద పెద్ద దిబ్బలుగా నుండుటచేత సాగు చేయుటకు వీలు లేకపోయెను. కాని ముందు సంవత్సరమునకు పూర్తిగా సాగు చేయగలము.

వ్యవసాయకూలీ సంఘసభ్యులు మొత్తం 100. అందులో నుండి ఈ 66 గురు సమిష్టి క్షేత్రములో సాగుచేయుటకు మనస్ఫూర్తిగా యిష్టపడి పనిచేయుచున్నారు. ఈ సమిష్టి క్షేత్రములో సకాలములో పనిచేయుటకు రాని వారినుండి ఆయారోజులలో గ్రామకూలి రివాజు ప్రకారం వారినుండి అపరాధం క్రిందవసూలు చేసినమొత్తం రు 32/ లు. అట్లు వసూలు చేయబడిన అపరాధమునుండి - సమిష్టి క్షేత్రములో దుక్కివద్దె రాలకు రు 8-0-0 లున్నూ ఎదువులకు రు 16-0-0 లున్నూ ఖర్చుపెట్టబడినది. పోగా మిగిలిన రు 8/- ను కూలి దొరకనిరోజున అందరు కలిసి వారికి అవసరమైన వస్తువులను తెచ్చుకొనిరి. పోగా ఈరోజుకు అపరాధముల తాలూకు డబ్బు నిల్వలేదు. ముఖ్యముగా యిందులో గమనింపవలసిన విషయములు. (సమిష్టిక్షేత్రములో)

నిబంధనలు

(1) ఇందు చేరినవారందరు వ్య. కూ. సంఘములో సభ్యులై వుండాలి.

(2) ప్రతిఒక్కరు మనిషి 1కి సంవత్సరమునకు 0-1-0 వంతున, (వ్య: కూ. సం) చెల్లించవలెను.

(3) ఈ సంఘమునకు ఎన్నికతో వచ్చిన 5 గురకు తగ్గకుండా 11 మందికి హెచ్చకుండా అనుభవము గల పంచాయతి సభ్యులుందురు. 1 అధ్యక్షుడు, 1 కార్యదర్శి మిగిలినవారు సభ్యులు.)

(4) ప్రతిసభ్యుడు సంఘశ్రేయస్సు కోరి, తాను నిజాయితిగాను - మర్యాదగాను ప్రవర్తించుచు; యితరులను మర్యాదతో చూడవలెను.

(5) ప్రతిసభ్యుడు యితరుల కష్టమును గుర్తించి- తన చేతనైన సహాయమును చేయవలెను.

(6) సమిష్టివ్యవసాయక్షేత్రములో పాల్గొను సభ్యులందరు హెచ్చు-తగ్గులు; కుల-మత తగాదాలు లేక - స్త్రీ - పురుష భేదముల పాటింపక, అందరు కష్టపడి - కష్టమునకు తగిన ఫలితమును పొందవలెను.

(7) యిందులోని ఫలసాయమున 1/4 భాగమును నిల్వ యుంచుకొని మిగిలిన దానినే పంచుకొనవలెను ఈ నిల్వయుంచిన 1/4 భాగమును అతికష్టకాలములో 100 కి 75 మంది యిష్టముమీద ఎప్పుడైనను ఖర్చు చేసికొనవచ్చు.

(8) సంఘ సభ్యుల విజ్ఞానాభివృద్ధులకు అవసరమగు ఒక పత్రికను తెప్పించుకొనవచ్చును. (పుస్తకములు గూడ)

(9) సమిష్టిక్షేత్రములో పాల్గొనక-సంఘ విద్రోహచర్యలు జరుపువారిని సంఘము నుంచి తొలగించుటయే గాక సమిష్టి క్షేత్రమున వచ్చు లాభమును వాటీయకయే సంఘపరము చేయబడును.

(10) ప్రతిసభ్యుడు సంఘ శ్రేయస్సుకై సక్రమమైన మార్గములను చూడవలెను.

(11) ప్రతిసభ్యుడు రైతులను ప్రేమించుచు - వారిసహాయ సానుభూతులను పొంది సంఘమును బలపరచవలెను.

(12) ప్రతిసభ్యుడు, సంఘసేవ చేయుచు రైతులచేతను - ప్రభుత్వము చేతను - సంఘము గుర్తింపబడునట్లు చేయవలెను.

ఈపై నిబంధనలను మనస్ఫూర్తిగా అమోదించి 66 గురు సభ్యులు మాత్రమే సమిష్టి వ్యవసాయక్షేత్రము"న చేరారు. కాని మాది నూతనప్రయత్నమగుటచేత ఇందనేక లోపములుండవచ్చు. దయయుంచి సరియైన సూచనలు చేయువారికి మా కృతజ్ఞత తెల్పుతూ వాటిననుసరించుటకు ఉత్సాహవంతులమై యున్నామని తెల్పుచున్నాను.

గెరిల్లా

— లేఖ ౨

ప్రియమైన కామ్రేడ్ !

ఈ రోజులలో నేను ఆధునికమైనా చరిత్రలో ఒక అధ్యాయాన్ని గురించి వ్రాస్తాను. చైనాలో గెరిల్లాలు యెందుకు, ఏవిధంగా, జయించుతున్నారో, పెంగ్-టే-హ్యూ అనే సుప్రసిద్ధ కమ్యూనిస్టు సేనాని తెలియజేసిన విషయాలు ఇందులో నీకు వ్రాస్తున్నాను. మన దేశపరిస్థితులుకూడా చైనా పరిస్థితులనే పోలి యుండడంవల్ల అవి తెలుసుకొంటే మనకు చాలా ఉపయోగం.

గెరిల్లాదళాలెందుకు బయల్దేరాయి?

చైనా గెరిల్లాలు యే పరిస్థితులలో ఎలా వచ్చారో కామ్రేడ్ పెంగ్ యిలా చెప్పాడు.

"దేశమంతా, ముఖ్యంగా పల్లెటూళ్లు, ఆర్థికంగా అథోగతిపాలైన రోజులవి. సామ్రాజ్యవాదులు, జమీందార్లు, సేనానాయకులు కలిసి పల్లెటూళ్ళ ఆర్థిక జీవనాన్ని ధ్వంసం చేశారు. సేనానాయకులు తమలో తాము అధిపత్యంకొరకు అంతర్యుద్ధాలలో నిమగ్నులై, పేద ప్రజలను దాస్యజీవనానికి గురిచేశారు. గ్రామాలలో నిరుద్యోగం విపరీతంగా వ్యాపించింది. పేదరైతులు తీవ్రంగా అసంతృప్తిచెంది, ఈ పాడు పరిస్థితుల్ని మార్చడానికి పూనుకున్నారు. ఇందుకై పోరాడేటందుకు సిద్ధమయారు. చైనాలో గెరిల్లాదళాలు బయల్దేరడానికి అనుకూల పరిస్థితులివి. రెండవకారణం, దేశంలో యెక్కువ భాగం రైల్వేలు లేక, రోడ్లు లేక, సరియైన వంతెనలు లేక, చాలా వెనుకబడియుండడంవల్ల ప్రజలు సులభంగా ఆయుధాలు ధరించి, దళాలుగా యేర్పడగలిగారు. మూడవకారణం, యుద్ధవ్యూహాని కనుకూలమైన ప్రదేశాలన్నీ సామ్రాజ్యవాదుల క్రిందనే ఉన్నప్పటికీ, వారి పెత్తనం ఒకేరీతిని, సమానంగా లేదు. సామ్రాజ్యవాదులాక్రమించుకొన్న ప్రదేశాలు ఒకదానికి, మరోదానికీ సంబంధం లేకుండా వుండేవి. వీటి మధ్య ప్రదేశంలో సులభంగా గెరిల్లాదళాలు తయారుకాగలవు. నాలుగోకారణం, 1926-27 సంవత్సరాలలో జరిగిన చైనా విప్లవం అసంఖ్యాక ప్రజల్ని ఉత్తేజపరిచింది. 1927లో విప్లవం అణచివేయబడి, పట్టణాలలో చాలామంది హత్యచేయబడిన తరువాత విప్లవకారు లనేకమంది పోరాటమార్గంకొరకు వెతక ప్రారంభించారు. సహింపజాలని ఆర్థిక- సాంఘిక పరిస్థితులు విప్లవాన్ని తీసుకొచ్చాయి. ఈ ప్రజావుద్యమానికి సరియైన నాయకత్వం, స్వరూపం, సమాన ఆదర్శం, యివ్వడ మవసరమైంది. ఈ పరిస్థితులన్నీ గెరిల్లాదళాల అభివృద్ధికి, విజయాలకు, సహాయపడ్డాయి....

ప్రజలు - సైనికులు

"ఇంతేకాదు చైనాలో గెరిల్లా యుద్ధవిధాన మెందుకు జయించిందంటే, గెరిల్లాలెందుకు అజేయమైనవారంటే, ప్రజాసామాన్యం గెరిల్లాసైనికులతో చేయిచేయికలిపి, సహాయం చేస్తున్నారు. కమ్యూనిస్టు గెరిల్లాలు యుద్ధంచేసే యోధులుమాత్రమే కాదు. వారు రాజకీయప్రచారకులుకూడ. నిర్మాణ పద్ధతులలో వీరు ఆరితేరినవారు. వీరెక్కడికెళితే అక్కడ విప్లవసందేశాన్ని బోధిస్తారు....గెరిల్లా యెప్పుడూ ఒకేచోట వుండరు. అలాచేస్తే, నాశనం తప్పదు. నిరంతరం వారు వేర్వేరు ప్రదేశాలకు చెదిరిపోయి, ఆయా ప్రదేశాలలో తమచుట్టూ రక్షణదళాలను తయారు చేసుకొంటూ వుండాలి. పోరాటం యొక్క ప్రతిదశలోను రాజకీయ తరిఫీదు తప్పనిసరిగా వుండాలి. ప్రతి కొత్తగ్రూపులోను స్థానికనాయకుల్ని తరిఫీదు చేయాలి. కొంతవరకు యితర ప్రదేశాల నుంచి స్థానిక నాయకులను తీసుకురావచ్చు. కాని స్థానికప్రజాసామాన్యంనుంచి నిరంతరం కొత్తనాయకుల్ని తయారుచేసి వారికి ఉత్సాహ మీయగలశక్తి ఉద్యమాని కుండాలి. ఉండకపోతే, శాశ్వత విజయాలు లభించవు....గెరిల్లా యెత్తుగడలలో ముఖ్యమైన కొన్ని నిబంధనలున్నాయి. అవి తప్పక ఆచరణలో పెట్టాలి. చిరకాలానుభవం వల్ల మేము వాటిని నేర్చుకున్నాం. పరిస్థితుల్ని బట్టి వాటిని మార్చుకోవచ్చు; కాని వాటికి వ్యతిరేకంగా నడిస్తే, సాధారణంగా నాశనం తప్పదు. ఈ నిబంధనలు క్రిందసూచించబడుతున్నాయి.

ముఖ్యమైన నిబంధనలు

"1. జయించే అవకాశాలుంటే గాని గెరిల్లాలు పోరాటానికి దిగకూడదు.

2. గెరిల్లాదళం సరిగా నడిపించబడితే, అకస్మాత్తుగా శత్రువుపై పడి దాడిచేయడం వల్ల జయంలభించి తీరుతుంది. ఒకేచోటవుండి యుద్ధం చేయడం పనికిరాదు. గెరిల్లా దళానికి మామూలు సైన్యాలలోమాదిరి సహాయంచేసే సహాయక (Auxiliary) దళంగాని, వెనుక భాగంలో ఉండే సైనికదళం (Rear) గాని, సప్లయిలు వచ్చేమార్గాలు - రహదారులుగాని, ప్రత్యేకంగా ఉండవు. శత్రువు సప్లయిమార్గాలు, రహదారులే గెరిల్లాలు వినియోగించుకోవాలి. దీర్ఘకాలం జరిగే మామూలు నిలకడ యుద్ధంలో శత్రువుకే అన్ని అనుకూలాలు వుంటాయి. కాబట్టి, గెరిల్లాయుద్ధం ఎంత యెక్కువకాలం సాగుతుందో, విజయానికి అంతతక్కువ అవకాశము టుంది.

3. "ఎక్కడైనా యుద్ధం చేయవలసివస్తే ముందుగానే అతి జాగ్రత్తగా, వివరాలతో సహితంగా, దాడి సల్పవలసిన ప్లాన్ ఒకటి వేసుకోవాలి. ముఖ్యంగా వెనక్కు తగ్గవలసిన విధానంకూడా ఆప్లాన్‌లో ఉండాలి. ఈ విధంగా ముందుగానే పూర్తియైన జాగ్రత్తలో ఉండకపోతే, దాడి యెంతబలమైనదైనప్పటికీ శత్రువు యొక్క వ్యూహంలో పడిపోడానికి అవకాశముంటాయి. శత్రువుకంటె చక్కగాయుక్తులు పన్నగలశక్తి గెరిల్లాదళాలకుండాలి. ఇందులో పొరబాట్లుచేస్తే, నాశనం తప్పదు.

4. శత్రుసేనలతో ప్రత్యక్షంగా, ముఖాముఖిని, యుద్ధంచేయాలంటే, శత్రువు సంఖ్యకంటె పెద్దసంఖ్య గెరిల్లాల కుండాలి. కాని, శత్రుసేనలు నడుస్తూంటేగాని, విశ్రాంతి తీసుకొంటూంటేగాని, సరియైన కాపలాలేకుండా వున్నప్పుడుగాని, చాలా కొద్దిమందిగల గెరిల్లాదళం శత్రువుయొక్క కీలక స్థానంలో అకస్మాత్తుగా, చొరవతో, దాడిసల్పవచ్చు. అనేక వేలు గల శత్రుసేనలపై చైనా గెరిల్లాలు కొన్ని వందల మందిలో ఈ విధమైన అకస్మాత్తుదాడులుసల్పి, జయం పొందారు. ఇట్టి దాడులు తప్పక జయించాలంటే, అకస్మాత్తుగా శత్రువుపై బడటం, చేయవలసిన పనిని అతి వేగంతోచేయడం, అకుంఠితమైన ధైర్యసాహసాలు, అనుమానాలకు తావులేని నిర్ణయాలివ్వడం, ఎటి లోపాలులేని ఒకప్లాను ముందుగా తయారుచేసుకోవడం, శత్రువుకు బలహీనమైన కీలక స్థానమేదో తెలుసుకోవడం, యివి అత్యవసరం. ఈ పద్ధతితో జయం పొందాలంటే, చాలా అనుభవంగల గెరిల్లాదళం కావాలి.

5. పోరాటంలో దిగినతర్వాత గెరిల్లాదళం యెటువేపైనా చటుక్కున వెళ్ళి సర్దుకోవలసిన చాకచక్యం వుండాలి. శత్రువుయొక్క బలంగాని, సంసిద్ధతగాని, పోరాటశక్తిగాని, తమకంటె యెక్కువగా ఉంటే, గెరిల్లాలు పోరాటాన్ని నిలిపివేసి, ఎంత వేగంతో దాడిచేశారో, అంత వేగంతో వెనక్కు తిరోగమనం చేయవలసియుంటుంది. సైన్యాధికారి పోరాటంలో పడిపోతే, తక్షణమే మరొక గెరిల్లావచ్చి అతని స్థానములో నిలబడటానికి ప్రతి దళములోను కొందరికి ప్రత్యేక తరిఫీదు యివ్వాలి. గెరిల్లా యుద్ధాలలో సహాయసేనానుల చాకచక్యం చాలా ప్రధాన పాత్రవహిస్తుంది.

6. "ఈ క్రింది ప్రధాన యెత్తుగడలలో ప్రతిగెరిల్లా ఆరితేరి యుండాలి. శత్రువు దృష్టిని మరొకవైపు ఆకర్షించడం (Distraction) అడవి మృగాల వేటలోమాదిరిగా శత్రువు ప్రమాద స్థలంలో పడేటట్లు చేయడం (Decoy); తప్పు మార్గంలో శత్రువు నడిచేటట్లు చేయడం (Divertion) పొదలచాటున, గోడలలోన దాగుకోవడం (Ambush) శత్రువును మోసగించడానికి దాడిచేస్తూన్నట్లు నటించడం (Fient) అనేకరీతులుగా శత్రువును చీకాకుపరచడం (Irritation)."చైనాభాషలో ఈయెత్తుగడలకు."పడమటదాడిచేస్తూ తూర్పున దాడిచేస్తూన్నట్లు నటించడ" మంటారు.

7. శత్రువుయొక్క ప్రధానదళాలపైగెరిల్లా లెప్పుడూ దాడి చేయకూడదు. అన్నిదళాలలో యెక్కువ బలహీనమై, యెక్కువ ముఖ్యమగు కీలకస్థానంపై దృష్టిని కేంద్రీకరించాలి.

8. గెరిల్లాల ప్రధానదళా లెక్కడున్నాయో శత్రువు కనిపెట్టకుండా తగిన కట్టుదిట్టాలు ముందుగానే చేసుకోవాలి. కనుకనే, శత్రువు ముందుకొస్తూంటే, గెరిల్లాలెప్పుడూ ఒకేచోట గుమిగూడి ఉండకూడదు. తరచు తమతమ స్థానాలు మార్చుకొంటూ వుండాలి. దాడి సల్పడానికి ముందు రోజుకు రెండు, లేక మూడు, స్థలాలైనా మారుతూవుండాలి. గెరిల్లాలు జయించాలంటే, తమ నడకల రహస్యాలెవరికి తెలియకుండా కాపాడాలి. శత్రువు ముందుకొస్తూంటే యెదుర్కోవడానికి ప్లాన్ ఎంత ముఖ్యమో, వెనక్కు తగ్గడానికి కూడా ప్లాన్ అంత అవసరం.

9. గెరిల్లాలు శత్రువుకంటె యెక్కువ చురుకుగా పనిచేయగల్గడం మాత్రమేకాదు. స్థానికప్రజలతో ప్రత్యక్ష సంబంధం ఉండటం వల్ల శత్రువుకంటె యెక్కువ చాకచక్యంకూడా ఉంటుంది. ప్రతిరైతు గెరిల్లాదళాలకు సి. ఐ. డి. గా పనిచేయగలిగి వుంటే, ఆదర్శనీయమైన పరిస్థితులున్నాయన్న మాట. అప్పుడు గెరిల్లాలకు తెలియకుండా శత్రువు ఒక్క అడుగుకూడా ముందుకు వేయలేడు.... కాబట్టి, గెరిల్లాయుద్ధానికి ఈక్రింది ప్రధాన లక్షణాలు అవసరం. నిర్భయం, చురుకుతనం, కుశాగ్రబుద్ధి, చటుక్కున చెల్లా చెదరుకావడం, రహస్యాలు దాచడం, కార్యరంగంలో ఆకస్మిక చర్యలు, పట్టుదల. రైతాంగం ఈ వుద్యమాన్ని బలపరచుతూ పాల్గొనేటట్లు చేయడం అత్యవసరం. రైతులు ఆయుధాలు ధరించి పోరాటంలో పాల్గొనకపోతే, గెరిల్లాదళాలు పనిచేయడానికి మూలాధారమే లేదన్నమాట. కాబట్టి "గెరిల్లాలు ప్రజలహృదయంలో స్థానం సంపాదించాలి."

చైనా గెరిల్లాలు తమ అనుభవంమీద నేర్చుకున్న పాఠాలివి. మన దేశంలోకూడా ఇవి గెరిల్లాలకు విశేషంగా సహాయంచేస్తాయి.

బ్రిటిషు కమ్యూనిస్టుపార్టీ ప్రతిజ్ఞ

భారతకమ్యూనిస్టుపార్టీ మా పార్టీకి తద్వారా బ్రిటీషు ప్రజలకు పంపిన సుహృద్భావ సందేశానికి కృతజ్ఞులం.

భారత జాతీయైక్యతకొరకు, స్వాతంత్ర్యం కొరకు మీరు జరుపుతున్న ఉద్యమంతోమేము సంపూర్ణంగా ఏకీభవించుతున్నాం. ఉన్నత ఆదర్శంకోసం సాగించబడుచున్న మీపోరాటానికి మా హృదయపూర్వక అభివందనాలు. మన రెండు దేశాల ప్రజల భావిగతినిర్ణయించబడనున్న నేటి క్లిష్ట పరిస్థితులలో భారత స్వాతంత్ర్యానికి, భారతజాతీయ ప్రభుత్వ స్థాపనకు, బ్రిటీషు ప్రజల సహకారాన్ని సంపాదించడానికి మేము ప్రతిన బూనుతున్నాం. ఫాసిజానికి వ్యతిరేకంగా మిత్రరాజ్యాల ప్రజలకు స్వతంత్ర భారతదేశం సంపూర్ణ సహాయం చేయగలుగుతుందని మేమువిశ్వసించుతున్నాం.

ఈ క్రింది నినాదాలపై బ్రిటీషు ప్రజలను సమీకరించడానికి దేశ మంతటా ప్రచారం కావించుతున్నాము.

"భారత స్వాతంత్ర్యాన్ని గుర్తించుతూ వెంటనే రాయబారాలు ప్రారంభించాలి.

మిత్రరాజ్యాల సహాయంతో భారత దేశరక్షణ బాధ్యతవహింప సిద్ధాంగావున్న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతోకూడిన జాతీయ ప్రభుత్వాన్ని వెంటనే యేర్పరచాలి.

అట్టి ప్రభుత్వంలో అన్ని ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులు వుండాలి. ఎవరు యెంతమంది వుండాలా అనేది రాయబారాల ద్వారా పరిష్కరించబడాలి. ఏ ముఠాకు అసలు స్కీమును ఆటంకపరచే హక్కు వుండరాదు."

లక్షల కొలది బ్రిటిషు కార్మికులు భారత జాతీయ వాంఛను బలపరుస్తున్నారు. దేశ మంతటిలోను పెద్దవైన ఇంజనీర్ల సంఘం, గనుల కార్మికుల సంఘం, రైల్వే కార్మికుల సంఘాలు భారత స్వాతంత్ర్యాన్ని బలపరుస్తూ తీర్మానాలు చేశాయి.

చర్చిల్. అమెరీలు పార్లమెంటులో చేసిన సంకుచిత ఉపన్యాసాలను అసంఖ్యాకులైన కార్మికులు, కమ్యూనిష్టులు, లిబరల్సు నిరసించుతున్నారు. భారత నాయకులతో వెంటనే రాయబారాలు సాగించాలని కోరుతున్నారు.

భారత కమ్యూనిష్టు పార్టీ అనేక కష్టాలను యెదుర్కొంటూ ప్రజ లందరిని ఫాసిజాన్ని యెదిరించడానికి, స్వాతంత్ర్యం కొరకు సంఘటిత పరుస్తున్నందుకు అభివందనాలు. మీరు ప్రారంభింపనున్న దేశ వ్యాపిత ఐక్యతా ఉద్యమానికి మా సుస్వాగతం.

దేశరక్షణకు భగ్నం కలిగించే కార్యాలలో పాల్గొనకుండా, భారత జాతీయవాంఛను బలపరుస్తునందులకు భారత కార్మికవర్గానికి మా అభివందనాలు.

బ్రిటను, ఇండియా దేశాల స్వాతంత్ర్యానికి మానవకళ్యాణానికి ప్రమాదం రానున్నసమయమిది. ఫాసిస్టు వ్యతిరేకులైన భారత యోధులందరినీ వెంటనే విడుదలచేయించాలి. తద్వారా మనం జపాన్ దుండగీడులనుండి ఆసియా ఖండాన్ని రక్షించి, ఫాసిజంపై సత్వరవిజయాన్ని పొందగలం.

హృదయపూర్వక అభివందనాలతో,

— హేరీ పొలిట్

Published by Katragadda Rajagopala Rao and Printed at The Popular Printers, Governorpet, Bezwada.

END OF ISSUE